

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

21.08.2026
శుక్రవారం | రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 52
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి – జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.

# సీట్లు తగ్గొద్దు.. నిధులు తగ్గొద్దు..



- దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి డిమాండ్
- డీలిమిటేషన్‌పై దక్షిణాది ఆందోళన
- నిధుల పంపకంపై దక్షిణాది గళం
- కావేరిపై భిన్న స్వరాలు
- చంద్రబాబు.. అభివృద్ధి, కనెక్టివిటీపై ఫోకస్

**చెన్నై, ఆగస్ట్ 20, అనంత జనశక్తి న్యూస్**

దక్షిణ మండలి సమావేశం ఈసారి కీలక రాజకీయ, ఆర్థిక అంశాలకు వేదికగా మారింది. డీలిమిటేషన్, కేంద్ర నిధుల పంపకం, రాష్ట్రాల హక్కులు, నదుల అనుసంధానం, అభివృద్ధి, కనెక్టివిటీ వంటి అంశాలపై దక్షిణాది రాష్ట్రాల నేతలు తమ అభిప్రాయాలను బలంగా వినిపించారు. రాష్ట్రాల ప్రత్యేక ప్రయోజనాలతో పాటు కేంద్రం ముందు సమిష్టిగా తమ డిమాండ్లను ఉంచే వేదికగా ఈ సమావేశం కనిపించింది. మొత్తంగా సీట్లు తగ్గొద్దు.. నిధులు తగ్గొద్దు.. రాష్ట్రాల హక్కులు తగ్గొద్దు అన్న సందేశం బలంగా వినిపించింది.

5లో..

# అన్ని విధాలుగా అండగా ఉంటాం



2లో..

- బీఆర్ఎస్ పార్టీ న్యాయం చేయిస్తది
- పాలిటెక్నిక్ విద్యార్థుల పోరాటానికి..
- సంఘీభావం ప్రకటిస్తున్న: కేటీఆర్

# చర్చలు విఫలం

## స్టైఫండ్ పెంపుపై పట్టు.. జూడాల సమ్మె ఉధృతం..!



2లో..

**అమరావతి, ఆగస్ట్ 20, అనంత జనశక్తి న్యూస్**

స్టైఫండ్ పెంపు డిమాండ్‌తో సమ్మె చేస్తున్న ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్లతో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జరిపిన చర్చలు విఫలమయ్యాయి. స్టైఫండ్ పెంపు విషయంలో ప్రభుత్వం, జూనియర్ డాక్టర్ల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో చర్చలు అసంపూర్తిగా ముగియగా.. జూనియర్ డాక్టర్లు మాత్రం సమ్మె కొనసాగిస్తున్నారు.. అంతేకాదు.. తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు జూడాలు..

# రెవెన్యూ శాఖలో 30% కమీషన్ రాకెట్

## 22ఏ భూములపై హరీశ్ రావు ఫైర్








- 22ఏ జాబితాలో అక్రమాలంటూ ఆరోపణలు
- 22ఏ పేరుతో వసూళ్లు: హరీశ్ రావు
- స్వతంత్ర విచారణకు హరీశ్ రావు డిమాండ్
- పొంగులేటి తొలగింపునకు హరీశ్ డిమాండ్
- 22ఏ భూములపై రాహుల్‌కు హరీశ్ లేఖ
- బినామీలపై విచారణ జరపాలన్న హరీశ్

**హైదరాబాద్, ఆగస్ట్ 20, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణలో సెక్షన్ 22A నిషేధిత జాబితా భూముల వ్యవహారంలో అవకతవకలు జరుగుతున్నాయంటూబీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి.. హరీష్ రావు బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌తో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) అనుమతులు ఉన్న ప్రైవేటు ఆస్తులను కూడా 22ఏ నిషేధిత జాబితాలోకి ఎక్కించి.. యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని హరీష్ రావు ఆరోపించారు.

2లో..

సెక్షన్ 22ఏ ఉద్దేశం నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లను అడ్డుకోవడమే తప్ప.. ప్రైవేటు ఆస్తులపై కొత్తగా వివాదాలు సృష్టించి వసూళ్లకుపాల్పడటం కాదని హరీశ్ రావు తన లేఖలో పేర్కొన్నారు. దశాబ్దాల క్రితమే అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) కింద క్రమబద్ధీకరించిన భూములు, రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు ఉన్న ఆస్తులను కూడా మళ్లీ 22ఏ జాబితాలో చేర్చి స్తంభింపజేస్తున్నారని విమర్శించారు. రెవెన్యూ శాఖలో 30 శాతం కమీషన్ వసూళ్ల రాకెట్ నడుస్తోందని హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించుకునేందుకు దళారులు మార్కెట్ విలువలో 30 శాతం వరకు కమీషన్ డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పరిసరాల్లోని భూములపై వివాదాలు సృష్టించి.. రాజకీయ పలుకుబడి ఉన్న బినామీ సంస్థలతో 50:50 జాయింట్ డెవలప్‌మెంట్ ఒప్పందాలు చేసుకునేలా భూ యజమానులపై ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలను హరీష్ రావు లేఖలో ప్రస్తావించారు.

# పంటల బీమా విషయంలో రైతులు త్వరపడాలి

- బీమా నమోదుకు ఈ నెలాఖరు వరకే గడువు
- ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రతి రైతు బీమా రక్షణ పొందాలి
- రైతు చెల్లించాల్సిన ప్రీమియం వాటా స్వల్పమే: అచ్చెన్నాయుడు
- ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో రైతులకు అవగాహన కల్పించాలి



2లో..

# అరణ్యానికి సాంకేతిక రక్షణ

- అడవిలో ప్రతి కదలికపై నిఘాకు అత్యాధునిక కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్
- కర్ణాటక నమూనా అటవీ పరిరక్షణపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టి
- ప్రతి అంగుళం అడవిని పరిరక్షించేందుకు ఆధునిక సాంకేతిక వ్యవస్థ

2లో..

**అమరావతి ఆగస్టు 20 అనంత జనశక్తి ప్రతినిధి**

కర్ణాటక అటవీ శాఖ అనుసరిస్తున్న తరహా అత్యాధునిక సాంకేతిక పరిపాలనా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రతి అంగుళం అటవీ భూమిని సంరక్షించే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. నూతనంగా నిర్మిస్తున్న అరణ్యారామంలో కర్ణాటక తరహా అధునాతన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.

# యూకేజీ విద్యార్థి మృతి

- టీచర్ దెబ్బలకు ఆగిన పసి గుండె..!
- విశాఖపట్నంలో ఘటన
- లిటిల్ గార్డెన్స్ స్కూల్‌లో..

2లో..



# అసెంబ్లీకి రాకుండా పారిపోతున్న జగన్

- మంత్రి నారా లోకేష్ కామెంట్
- పరీక్షల వ్యవస్థపై అవగాహన లేదు
- ఏపీపీఎస్సీ, డీఎస్సీ ఏంటో తెలీదు

5లో..

**అమరావతి, ఆగస్ట్ 20, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించే పరీక్షల వ్యవస్థపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు అవగాహన లేదని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి లోకేశ్ గురువారం కౌంటర్ ఇచ్చారు. ఏపీపీఎస్సీ, డీఎస్సీ రెండూ ఒకటే అనుకుంటున్నారా? అంటూ వైసీపీ అధినేతపై మండిపడ్డారు. ఏపీపీఎస్సీ అంటే ఏమిటో, డీఎస్సీ అంటే ఏమిటో జగన్‌కు తెలియదంటూ వ్యంగ్యంగా అన్నారు. ఈ రెండు పరీక్షలను ఒకే గాటిన కట్టడం, ఒకటే అనుకోవడం జగన్ అవగాహన స్థాయిని తెలియజేస్తుంటూ ఎద్దేవా చేశారు.



# డీఎస్సీపై సీబీఐ విచారణకు సిద్ధమా?

- చంద్రబాబుకు జగన్ సవాల్
- ఏపీపీఎస్సీ, డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు
- తప్పు ఒప్పుకోవడానికి నిరాకరణ

5లో..



# కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ కన్నుమూత

- 1984 నాటి సిక్కుల కేసులో..
- జీవిత ఖైదు అనుభవిస్తున్న నేత!
- తీహార్ జైలులో అనారోగ్యంతో కన్నుమూత

5లో..



# మంత్రి పొంగులేటి క్షమాపణ చెప్పడం సిగ్గుచేటు

- ఎంపీ లక్ష్మణ్ కామెంట్
- మంత్రి పదవి రాజీనామా చేయాలి
- ఎవరు చెప్తే భూములను నిషేధిత జాబితాలో పెట్టారు?

**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఎవరు చెప్తే భూములను నిషేధిత జాబితాలో పెట్టారో మంత్రి పొంగులేటి చెప్పాలన్నారు. తెలంగాణలో ప్రజాపాలన లేదని.. దోపిడి పాలన ఉందని విమర్శించారు. భూదందాలు చేస్తూ ప్రజల భూములను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో చేరిందన్నారు. ప్రజలు కష్టపడి సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా నడిపిస్తున్నారని వ్యాఖ్యానించారు.

2లో..



# చర్చలు విఫలం




(మొదటి పేజీ తరువాయి)

స్టైఫండ్‌ను 30 శాతం పెంచాలని మొదటి నుంచి డిమాండ్ చేస్తున్న జూనియర్ డాక్టర్లు.. కనీసం 20 శాతం అయినా పెంచాలని చర్చల సందర్భంగా కోరినట్లు తెలిపారు. అయితే 20 శాతం పెంపు కూడా సాధ్యం కాదని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేసినట్లు సమాచారం. జూనియర్ డాక్టర్లకు ఏటా 3 శాతం, హౌస్ సర్జన్లకు 5 శాతం వార్షిక ఇంక్రిమెంట్ ఇచ్చే అంశాన్ని మంత్రి సత్యకుమార్ ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు ఆర్థిక శాఖ అధికారులతో చర్చించిన తర్వాత మరోసారి జూనియర్ డాక్టర్లతో సమావేశమవుతామని మంత్రి సత్యకుమార్ చెప్పినట్లు సమాచారం. దీంతో సమస్య పరిష్కారానికి ప్రభుత్వం మరోసారి చర్చలు జరిపే అవకాశం ఉంది.

**సమ్మె కొనసాగిస్తామన్న జూడాలు**

అయితే ప్రభుత్వం నుంచి తమ ప్రధాన డిమాండ్‌పై స్పష్టమైన హామీ వచ్చే వరకు సమ్మె కొనసాగిస్తామని జూనియర్ డాక్టర్లు తేల్చిచెప్పారు. దీంతో జూడాలు యథావిధిగా విధులకు దూరంగా ఉండి సమ్మె కొనసాగిస్తున్నారు. స్టైఫండ్ పెంపుపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన నిర్ణయం వచ్చే వరకు వెనక్కి తగ్గేది లేదని జూడాల ప్రతినిధులు స్పష్టం చేశారు. మరోవైపు.. ఇదిలా ఉండగా రాష్ట్ర జూడాల సంఘం సమావేశం రేపు ఉదయం సిద్ధార్థ మెడికల్ కాలేజీలో జరగనుంది. ఈ సమావేశంలో ప్రస్తుత పరిస్థితిపై చర్చించి, సమ్మెను మరింత ఉధృతం చేసే దిశగా భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలుస్తోంది. సమావేశం అనంతరం APJUDA రాష్ట్ర ప్యానెల్ మీడియాతో మాట్లాడి.. చర్చల్లో జరిగిన అంశాలు, తమ తదుపరి కార్యాచరణపై పూర్తి వివరాలను వెల్లడించనుంది.

# పంటల బీమా విషయంలో రైతులు త్వరపడాలి

అమరావతి, ఆగస్ట్ 20:అనంత జనశక్తి న్యూస్

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం, అనిశ్చిత వర్షపాతం పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు పంటల బీమా విషయంలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. పంటల బీమా నమోదు చేసుకునేందుకు ఈ నెలాఖరు వరకే గడువు ఉన్నందున రైతులు ఆలస్యం చేయకుండా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ వేదికగా పిలుపునిచ్చారు. వాతావరణ పరిస్థితులు ఎప్పుడు ఎలా మారతాయో అంచనా వేయలేమని, ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం వంటి పరిస్థితుల్లో రైతుకు ఆర్థిక రక్షణ కల్పించడంలో పంటల బీమా అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు. రైతులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు.



**రైతుపై ప్రీమియం భారం చాలా స్వల్పమే**

పంటల బీమా కోసం రైతులు చెల్లించాల్సిన ప్రీమియం వాటా చాలా తక్కువగా ఉంటుందని అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రాంతం, పంటను బట్టి రైతు వాటా మారుతుందని, కొన్ని ప్రాంతాల్లో రైతు చెల్లించాల్సిన మొత్తం అత్యంత స్వల్పంగా ఉందన్నారు. మిగిలిన ప్రీమియం భారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తున్నాయని వివరించారు. స్వల్ప మొత్తాన్ని చెల్లించడం ద్వారా పంట నష్టం సంభవించినప్పుడు బీమా రక్షణ పొందే అవకాశం ఉన్నందున రైతులు దీనిని నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

**ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవ తీసుకోవాలి**

పంటల బీమా నమోదును కేవలం వ్యవసాయ శాఖ కార్యక్రమంగా చూడకుండా ప్రజాప్రతినిధులు కూడా బాధ్యత తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. ప్రతి ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో రైతులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, పంటల బీమా వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్హులైన రైతులందరూ బీమా నమోదు చేసుకునేలా ఎమ్మెల్యేలు చొరవ చూపాలని కోరారు. ఎల్‌నినో ప్రభావం ఉన్న నేపథ్యంలో రైతులు పంటల బీమాను తేలికగా తీసుకోవద్దు. ఈ నెలాఖరు వరకే అవకాశం ఉంది. చివరి రోజు వరకు వేచి చూడకుండా ప్రతి రైతు వెంటనే నమోదు చేసుకోవాలి. స్వల్ప ప్రీమియంతో లభించే బీమా రక్షణను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి అని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు.

# అరణ్యానికి సాంకేతిక రక్షణ

(మొదటి పేజీ తరువాయి)

ఈ వ్యవస్థ ద్వారా అడవుల మ్యాపింగ్‌తోపాటు పూర్తి స్థాయిలో వన్యప్రాణుల కదలికలు, అటవీ కార్యకలాపాలపై డిజిటల్ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇటీవల రాష్ట్ర అటవీ శాఖ ఐటీ సలహాదారు పెన్నమరెడ్డి నాగబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అటవీశాఖ బృందం కర్ణాటకలో మూడు రోజులపాటు పర్యటించింది. కర్ణాటక అటవీ శాఖ అనుసరిస్తున్న ఐటీ విధానాలు, జీఐఎస్, మొబైల్ అప్లికేషన్లు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ తదితర వ్యవస్థలపై అధ్యయనం జరిపి, పూర్తి వివరాలతో కూడిన నివేదికను పవన్ కళ్యాణ్ కి అందజేశారు. తమ పరిశీలనలు, కర్ణాటకలో విజయవంతమైన విధానాలపై పలు సూచనలు చేశారు. ఈ నివేదికను క్షుణ్ణంగా పరిశీలించిన పవన్ కళ్యాణ్ కర్ణాటకలో సత్ఫలితాలు ఇచ్చిన పలు విధానాలను రాష్ట్రంలో కూడా అమలు చేయాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.ముఖ్యంగా అడవిలో ప్రతి అణువును కేంద్ర కార్యాలయం నుంచి పర్యవేక్షించే విధంగా ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు పట్ల పవన్ కళ్యాణ్ ఆసక్తి కనబర్చారు. జియోస్పేషియల్ డ్యాష్‌బోర్డ్, డ్రోన్ ఆధారిత పర్యవేక్షణ, కెమెరా ట్రాప్‌ల ద్వారా వన్యప్రాణుల సంఖ్యపై ఎప్పటికప్పుడు విశ్లేషణ, అటవీ మార్గాల్లో ప్రయాణించే వాహనాల ట్రాకింగ్, గస్తీ పర్యవేక్షణ, అటవీ అగ్నిప్రమాదాలు, మానవవన్యప్రాణి ఘర్షణల పర్యవేక్షణ తదితర కార్యక్రమాలన్నింటినీ ఒకే చోటు నుంచి పర్యవేక్షించే వెసులుబాటు కలుగుతుందని అభిప్రాయపడ్డారు.




**సిబ్బందిలో జవాబుదారీతనం పెంచేలా...**

కర్ణాటక అమలు చేస్తున్న ఈగస్తు మొబైల్ అప్లికేషన్ ద్వారా కూడా అద్భుత ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయి సిబ్బంది విధుల పర్యవేక్షణ, వారి భద్రతా చర్యల్లో ఇది కీలకంగా వ్యవహరిస్తుందని, గస్తీ, హాజరు, నిరంతర మార్గనిర్దేశం, నివేదికల సమర్పణకు ఇది సమర్థవంతమైన సాధనంగా పని చేస్తోందని, ఆంధ్రప్రదేశ్ అటవీశాఖలో ఇప్పటికే అమలులో ఉన్న ఫారెస్ట్ పోర్టల్, సింగిల్ సైన్‌ఆన్ వ్యవస్థలను అనుసంధానించి ఈగస్తు మొబైల్ యాప్ రూపొందించాలని సూచించారు. ఇది వ్యవస్థలో జవాబుదారీతనాన్ని పెంపొందిస్తుందన్నారు.

**సత్వర పరిహారం అందించేలా**

వన్యప్రాణుల వల్ల అటవీ సరిహద్దు గ్రామాల్లో జరిగే పంటల నష్టానికి పరిహారం చెల్లించే ప్రక్రియను కూడా డిజిటలీకరణ ద్వారా మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని, తద్వారా పంటల నష్టంపై నివేదికలు, రైతులకు పరిహారం చెల్లింపుల వ్యవస్థలో మరింత పారదర్శకత వస్తుందని పేర్కొన్నారు. వేగంగా పరిహారం చెల్లించే వెసులుబాటు కలుగుతుందన్నారు. జీఐఎస్ ఆధారిత ధృవీకరణ వ్యవస్థను తక్షణం అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.అటవీ సరిహద్దులకు చట్టబద్ధమైన భద్రత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మార్గనిర్దేశకత్వంలో, అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ బీజేపీ నాయకత్వంలో ఇప్పటికే అటవీ సరిహద్దుల డిజిటలైజేషన్ ప్రక్రియను రాష్ట్రంలో కూడా చేపట్టిన విషయాన్ని శ్రీ పవన్ కళ్యాణ్ గుర్తు చేశారు. తద్వారా అటవీ సరిహద్దుల చట్టబద్ధతను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు హనుమాన్ ద్వారా ఇప్పటికే మానవవన్యప్రాణుల ఘర్షణల నివారణ, విశ్లేషణ వ్యవస్థలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. ఇందుకోసం ఏఐ ఆధారిత ప్రమాద అంచనా వ్యవస్థలు, వన్యప్రాణుల సంచారానికి సంబంధించిన డ్యాష్‌బోర్డులు సిద్ధం చేసినట్లు స్పష్టం చేశారు.

**కర్ణాటకతో పరస్పర సాంకేతిక సహకారం**

ఇప్పటికే కర్ణాటక అటవీ శాఖతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధం వంటి పలు ఒప్పందాలు చేసుకున్నామని, పరస్పర సాంకేతిక సహకారం దిశగా అడుగులు వేయనున్నట్లు వివరించారు. అందుకోసం ఇరు రాష్ట్రాల అటవీశాఖల ఆధ్వర్యంలో సంయుక్త సాంకేతిక వర్క్‌షాప్‌లు, పత్రాల మార్పిడి, అవసరం ఉన్న చోట సోర్స్ కోడ్ భాగస్వామ్యం, జీఐఎస్‌లో ఉత్తమ విధానాల మార్పిడి, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్‌కు సంబంధించి వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# అన్ని విధాలుగా అండగా ఉంటాం



హైదరాబాద్, ఆగస్ట్ 20, అనంతజనశక్తి న్యూస్

పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేసేలా కాంగ్రెస్ సర్కార్ జీవో 97 తీసుకురాగా.. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కొనసాగుతున్న విషయం తెలిసిందే. జీవో 97కు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థులు చేస్తున్న పోరాటానికి ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ, బీఆర్ఎస్వీ మద్దతుగా నిలిచి ఆందోళనల్లో పాల్గొంటుంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విద్యార్థులకు, వారితో బీఆర్ఎస్వీ కలిసి చేస్తున్నపోరాటానికి పూర్తి సంఘీభావాన్ని ప్రకటిస్తున్నట్టు ట్వీట్ చేశారు.

విద్యార్థుల ఆందోళనకు సంబంధించిన వీడియోను ట్యాగ్ చేస్తూ.. రేవంత్ ప్రభుత్వం తీసుకున్న ఈ తప్పుడు నిర్ణయం వల్ల వేలాదిమంది పాలిటెక్నిక్ విద్యార్థుల భవితవ్యం అగమ్యగోచరంగా మారిందన్నారు. శాంతియుతంగా నిరసనను తెలుపుతున్న విద్యార్థుల మీద కొన్ని చోట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించిన దృశ్యాలు నన్ను కలచివేశాయి. విద్యార్థుల హక్కులను కాలరాయొద్దని కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నానన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడకుండా.. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే జీవో 97ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నా. ఇప్పటికే పలు నిరసన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం, బీఆర్ఎస్ నాయకులు పాల్గొని విద్యార్థులకు మద్దతు తెలిపారు. ఇక ముందు కూడా పాలిటెక్నిక్ విద్యార్థుల పోరాటానికి అన్ని విధాలుగా బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

## రెవెన్యూ శాఖలో
# 30% కమీషన్ రాకెట్

(మొదటిపేజీ తరువాయి)



22ఏ నిషేధిత భూముల వ్యవహారంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్వతంత్ర విచారణకు ఆదేశించాలని కోరారు. యాదాద్రి జిల్లాలో 40 వేల ఎకరాలను 22ఏ జాబితాలో చేర్చినట్లు 4 నెలల క్రితం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పిన విషయాన్ని కూడా హరీశ్ రావు తన లేఖలో ప్రస్తావించారు. ఈ అంశంపై సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన, తొలగించిన ప్రతి భూమిపై రిటైర్డ్ హైకోర్టు జడ్జి స్వతంత్ర విచారణ జరిపించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. 30 శాతం కమీషన్లు, 50:50 జాయింట్ డెవలప్‌మెంట్ ఒప్పందాల వెనుక ఉన్న వ్యక్తులు, దళారులు, బినామీ సంస్థలపై విచారణ జరపాలని కోరారు. అదే సమయంలో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించి.. ఏ ఆస్తిని ఎవరు 22ఏ జాబితాలో చేర్చారు.. ఎందుకు చేర్చారు.. ఎవరి ఆదేశాలతో తొలగించారు.. మధ్యవర్తుల ప్రమేయం ఉందా.. ఆర్థిక లావాదేవీలు జరిగాయా.. అనే అంశాలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు.

రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారీగా 22ఏ నిషేధిత భూముల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఈ సందర్భంగా హరీశ్ రావు కోరారు. ఏ భూమిని ఎప్పుడు జాబితాలో చేర్చారు.. ఎవరి ఆదేశాలతో తొలగించారు అనే వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలు అవాస్తవమైతే ప్రభుత్వం వెంటనే స్వతంత్ర విచారణకు ఆదేశించి తన నిజాయితీని నిరూపించుకోవాలని హరీశ్ రావు సవాల్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న పోరాటం కొనసాగుతుందని లేఖలో పేర్కొన్నారు.

## వన్ వేపై సర్‌ప్రైజ్ చెక్
# సామాన్యుడిలా బైక్‌పై..
### కేబీఆర్‌కు సీపీ సజ్జనార్

హైదరాబాద్, ఆగస్ట్ 20, అనంత జనశక్తి న్యూస్

హెచ్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనుల కారణంగా కేబీఆర్ పార్క్ చుట్టూ ఆగస్టు 18 నుంచి వన్ వే ట్రాఫిక్ విధానం అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీపీ సజ్జనార్ వన్ వే ట్రాఫిక్‌పై సర్‌ప్రైజ్ చెక్ నిర్వహించారు. సామాన్యుడిలా బైక్‌పై ప్రయాణిస్తూ ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. రోడ్ నంబర్ 45 నుంచి ఫిల్మ్‌నగర్ వరకు బైక్‌పై రెండు సార్లు తిరుగుతూ ట్రాఫిక్‌ను పరిశీలించారు.

జంక్షన్‌లలో విధుల్లో ఉన్న పోలీసులతో ట్రాఫిక్‌పై సీపీ ఆరా తీశారు. మధ్యాహ్నం కూడా మరోసారి ట్రాఫిక్ సరళిపై పర్యవేక్షించారు. వన్‌వే కారణంగా తొలి రోజు వాహనదారులు కొంత అయోమయానికి గురైనప్పటికీ.. రెండో రోజు నుంచి రాకపోకలు సాఫీగా సాగుతున్నాయని సజ్జనార్ తెలిపారు. అన్ని జంక్షన్‌లలో స్పష్టమైన సైన్‌బోర్డులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తగినంత మంది ట్రాఫిక్ సిబ్బందిని మోహరించినట్లు వెల్లడించారు. జీహెచ్‌ఎంసీ, నిర్మాణ సంస్థ సమన్వయంతో HCITY పనులు జరుగుతున్నాయన్నారు. పనులు పూర్తయ్యే వరకు వాహనదారులు సహకరించాలని కోరారు. ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటించాలని ప్రజలకు సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.






# మంత్రి పొంగులేటి క్షమాపణ చెప్పడం సిగ్గుచేటు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పడం సిగ్గు చేటని ఎంపీ అన్నారు. అధికారులను బాధ్యులుగా చేయడం కాదని.. దీనికి ఆదేశించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 22 ఏ జాబితాను బహిర్గతం చేయాలన్నారు. ప్రజల పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. 22 A భూములపై సీబీఐ విచారణకు ఆదేశించాలని.. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలన్నారు. భూములు నిషేధిత జాబితాలో పెట్టారని స్వయంగా మంత్రి కోమటిరెడ్డి బహిరంగ వ్యాఖ్యలు చేశారని అన్నారు. తెలంగాణలో భూముల పేరుమీద కుంభకోణాలు, సెటిల్మెంట్, దందాలు బయట పడుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో భూములు కాజేయాలని చూస్తే రేవంత్ రెడ్డి పీసీసీగా ఉండి పోరాటం చేశారని.. భూములు కాపాడుతామని చెప్పారని గుర్తుచేశారు.

అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని రేవంత్ అన్నారని లక్ష్మణ్ తెలిపారు. గత బీఆర్ఎస్ హయాంలో 22 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో అంటే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలోకి నెట్టిందని విమర్శించారు. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని మంత్రులు దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రజల ఆస్తులు భద్రంగా ఉండాలంటే ఆర్మీని దింపాలని ఇటీవల హైకోర్టు వ్యాఖ్యలు చేసిందన్నారు. ఎవరి ఇళ్లు ఎప్పుడు నిషేధిత జాబితాలోకి వెళ్తుందో అని ప్రజలు భయపడుతున్నారని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.

# యూకేజీ విద్యార్థి మృతి

విశాఖపట్నం, ఆగస్ట్ 20, అనంత జనశక్తి న్యూస్

విశాఖపట్నంలో దారుణం వెలుగు చూసింది.. విశాఖ నగరంలోని వన్‌టౌన్ ప్రాంతంలో విషాద ఘటన చోటుచేసుకుంది. స్కూల్ టీచర్ కొట్టడంతో ఆరేళ్ల విద్యార్థి మృతి చెందినట్లు ఆరోపణలు రావడం కలకలం రేపింది. లిటిల్ గార్డెన్స్ స్కూల్‌లో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. మృతుడిని ప్రణయ తేజగా గుర్తించారు. అతడు యూకేజీ విద్యార్థిగా కుటుంబ సభ్యులు తెలిపారు. టీచర్ దెబ్బలకు బాలుడు తీవ్రంగా గాయపడటంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. బాలుడిని కేజీహెచ్‌కు తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు సమాచారం. ఈ ఘటనతో బాలుడి కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. చిన్నారి మృతిపై ఆగ్రహం వ్యక్తం చేసిన బంధువులు కేజీహెచ్ వద్ద ఆందోళనకు దిగారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీచర్ దెబ్బల కారణంగానే బాలుడు మృతి చెందాడా? ఘటనకు దారితీసిన పరిస్థితులు ఏమిటి? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టాల్సి ఉంది. పూర్తి వివరాలు అధికారిక విచారణలో వెల్లడికావాల్సి ఉంది.అయితే, వైరల్‌గా మారిన ఓ వీడియో ప్రకారం మాత్రం.. తరగతి గదిలో అందరి క్లాస్ వర్క్ లేదా హోం వర్క్ చెక్ చేస్తున్న టీచర్ దగ్గరకు సదరు బాలుడు రగానే తీవ్రంగా ఏడవడం కనిపించింది.. వద్దు.. వద్దు అంటూ.. టీచర్‌ను బతిమిలాడుకున్నట్టుగా కనిపిస్తోంది.. కానీ, టీచర్.. అతడిని డ్రెస్‌ను సవరించే ప్రయత్నం చేస్తున్నట్టుగా కనిపిస్తోంది.. ఇంతలో ఆమె.. టై పట్టుకొని లాగడం..బాలుడి చెప్పంపై ఓ దెబ్బ కొట్టడంతో.. వెంటనే ఆ బాలుడు.. టీచర్‌పైనే ఒరిగిపోయాడు.. ఆమె దూరం తీసి నిలబెట్టే ప్రయత్నం చేస్తే.. మళ్లీ పైకి ఒరిగాడు.. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిపోయింది.. విద్యాబుద్ధులు



నేర్పుతారని స్కూల్‌కు పంపిస్తే.. భయపెట్టి.. కొట్టి.. చంపేస్తారా? అంటూ నెటిజన్లు మండిపడుతున్నారు.. అయితే, టీచర్ కొట్టడం వల్లే బాలుడు చనిపోయాడా? ఇంకా ఏమైనా అనారోగ్య సమస్యలు ఉన్నాయా? లాంటి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..

## విధుల్లో అలసత్వం వహిస్తే
# కఠిన చర్యలు తప్పవు..

- వైద్య సిబ్బందికి మంత్రి కందుల దుర్గేష్ హెచ్చరిక
- నిడదవోలు ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి కందుల దుర్గేష్.. ఎమర్జెన్సీ వార్డుల్లో స్వయంగా పరిశీలన..వైద్యసేవలపై ఆరా.. వైద్యుల తీరుపై తీవ్ర ఆగ్రహం
- నిడదవోలు నియోజకవర్గంపై పక్కా నిఘా..ప్రజా సమస్యల పరిష్కారంలో నో కాంప్రమైజ్..రాత్రైనా పగలైనా సమస్య తెలిసిన మరుక్షణమే ఆసుపత్రి బాట పట్టిన మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు ఆగస్టు 20 అనంత జనశక్తి న్యూస్

అసెంబ్లీ వేదికైనా, నియోజకవర్గ ప్రజా సమస్యలైనా మంత్రి దుర్గేష్ ప్రాధాన్యం ప్రజారోగ్యమే అని మరోసారి నిరూపితమైంది.. గత రెండు మూడు రోజులుగా స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో, పత్రికల్లో నిడదవోలు ప్రభుత్వాసుపత్రి సేవలపై వస్తున్న వార్తలపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పందించారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ఆయన నేరుగా నిడదవోలు ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఈ తనిఖీలో భాగంగా మంత్రి దుర్గేష్ ఎమర్జెన్సీ, జనరల్ వార్డులను స్వయంగా పరిశీలించారు. ఆసుపత్రి అంతా కలియతిరిగి, చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, డాక్టర్లు మరియు సిబ్బంది అందుబాటు, మందుల నాణ్యత గురించి అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆసుపత్రి వేళల్లో వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లలేని పేద ప్రజలే ప్రభుత్వాసుపత్రిని ఆశ్రయిస్తారని, వారికి సక్రమంగా వైద్యం అందించాల్సిన పూర్తి బాధ్యత వైద్య యంత్రాంగానిదేనని గుర్తుచేశారు.రాత్రి సమయంలో ఆసుపత్రిలో తప్పనిసరిగా ఇద్దరు డాక్టర్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.ఆసుపత్రి ప్రాంగణాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని, వైద్యపరమైన ఫిర్యాదులు పునరావృతం కాకూడదని హెచ్చరించారు. ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తుందని, ప్రజలకు సేవ చేయడానికి ఇష్టం లేనివారు బయటకు వెళ్లిపోవచ్చని ఘాటుగా తెలిపారు.నిడదవోలు ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటానని మంత్రి దుర్గేష్




పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి నేరుగా రాత్రి వేళల్లో ఆసుపత్రిని తనిఖీ చేసిన మంత్రి కందుల దుర్గేష్ చొరవపై స్థానిక ప్రజలు, రోగులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం



# పీఎం కేర్ నిధులను పాఠశాలల బాగుకు ఉపయోగించొచ్చు: దీప్కే



గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో సౌకర్యాల మెరుగుకు, అత్యాధునిక సాంకేతికతతో కూడిన 1,000 పైగా నూతన విద్యాలయాల నిర్మాణానికి పీఎం కేర్ నిధులను వాడొచ్చని సీజేపీ కన్వీనర్ అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. పాఠశాలలకు వెళ్లేందుకు సరైన రహదారులు లేక, తరగతి గదుల్లో కూర్చునే బల్లలు లేక, పాఠశాలల్లో తాగునీరు వసతి లేక దేశ విద్యార్థులు అవస్థలు పడుతున్నారని బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి 31, 2025 నాటికి పీఎం కేర్ ఫండ్ రూ.8,452 కోట్లు ఉందని తాజా ఆడిట్ నివేదిక వెల్లడించింది. ఈ నేపథ్యంలో ''ఓ వైపు రూ.8,500 కోట్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. మరోవైపు దేశ విద్యార్థులకు పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేవు. కాబట్టి ఆ నిధులను చిన్నారుల బదుల మెరుగుదలకు ఎందుకు ఉపయోగించకూడదు?'' అని దీప్కే ప్రశ్నించారు. మహాత్మాగాంధీ కుటుంబ సభ్యులు తమ వెంటే ఉన్నారని..అది తమ దేశభక్తికి గొప్ప ధ్రువపత్రం అని కాక్రోచ్ జనతా పార్టీ కన్వీనర్ అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. మహాత్మాగాంధీ మునిమనవడు తుషార్ గాంధీ బుధవారం ఛత్రపతి సంభాజీనగర్‌లోని దీప్కే స్వగృహంలో ఆయనతో భేటీ అయ్యారు.

**మహాత్ముడి విలువలతో జెన్ జీ**

మహాత్ముడి విలువలను జెన్ జీ ఆకళింపు చేసుకుందని గాంధీ మునిమనవడు తుషార్ గాంధీ పేర్కొన్నారు. మేధో నక్సల్ అన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలను ద్వేషపూరిత రాజకీయాలకు నిదర్శనంగా పేర్కొన్నారు.

# ఎన్‌టీఏ సంస్కరణకు తీసుకున్న చర్యలేవో తెలపండి



నీట్ సహా అనేక కీలక పరీక్షలు నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)లో సంస్కరణల్ని వ్యవస్థలో భాగం చేయాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు బుధవారం స్పష్టం చేసింది. నీట్ ప్రశ్నపత్రాల లీకేజి నివారణకై సిఫార్సులు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నియమించిన రాధాకృష్ణన్ కమిటీ, నందన్ నిలేకని కమిటీల సూచనల్ని అమలు పరిచేందుకు తీసుకున్న చర్యలేమిటో తనకు తెలియజేయాలని కోర్టు ఆదేశించింది. ఎన్‌టీఏలో సంస్కరణల్ని వ్యవస్థీకృతం చేయాల్సిన అవసరం ఉందని జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేల ధర్మాసనం పేర్కొంది.

**పేరుకుపోతున్న ఘనవ్యర్థాలపై ఆందోళన**

పంచాయతీలు, పట్టణాలు, నగరాల్లో భారీ స్థాయిలో పేరుకుపోతున్న ఘన వ్యర్థాలపై, వాటి నిర్వహణకు సంబంధించి ప్రజల్లో సామాజిక బాధ్యత కొరవడటంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఘనవ్యర్థాల నిర్వహణ, పారబోతలకు సంబంధించి కోర్టు అనేక నిర్దేశాలు వెలువరించింది. ఈ సంవత్సరం రూపొందించిన ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు నిర్దేశించిన ప్రమాణాల మేరకు మౌలిక సదుపాయాలు పెంపొందించాలని సూచించింది. ఘన వ్యర్థాలకు కారకుడినయ్యే హక్కు నాకుందే తప్ప వాటి నిర్వహణ, నియంత్రణ నా బాధ్యతలు కావన్న భావన సమాజంలో ప్రబలిపోయిందని, ఇది విచారకరమని జస్టిస్ ఎస్.వి.ఎన్. భట్టి, జస్టిస్ ఎన్.వి. అంజారియాల ధర్మాసనం పేర్కొంది.

# నా గుండె కోత, నాకు కలిగిన నష్టాలే నన్ను రాజకీయాల్లోకి లాగాయి

**- నా జీవిత అక్షరబద్ధీకరణ అంత సులువుగా కాలేదు**

**- కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ**

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తన జీవిత ప్రయాణంపై 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పేరిట రాసిన 544 పేజీల ఆత్మకథ నవంబరు 10న పాఠకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో ''నా జీవితాన్ని అక్షరబద్ధం చేయడమంటే నా మనసు లోతుల్లో దాచుకున్న జ్ఞాపకాల దొంతరలను విడమర్చడం, అనుభవాలను పంచుకోవడమే. నాకు ఎదురైన గుండె కోత, కలిగిన నష్టం నన్ను రాజకీయ ప్రపంచంలోకి నెట్టాయి. అప్పటి వరకూ నా గోప్యతను గట్టిగా కాపాడుకున్నాను. నా జీవితం గురించి రాయడం నాకు సులువు కాలేదు'' అని సోనియా పేర్కొన్నారు. భారత్ 'నాకు చెందిన అందమైన దేశం' అని ఆమె అభివర్ణించారు.

**ప్రేమ, పెళ్లి విషయాలు**

తన జీవితంలో జరిగిన కీలక ఘట్టాలు, విషయాలను ఆమె తన పుస్తకంలో పంచుకోనున్నారు. ఇందులో రాజీవ్ గాంధీతో ప్రేమ, పెళ్లి వంటి విషయాలను పేర్కొన్నట్లు సోనియా వెల్లడించారు. రాజకీయాల్లోకి రావడం, అందుకు దారితీసిన పరిస్థితులను పంచుకున్నట్లు ఆమె వివరించారు. తన కుటుంబం గురించే ఎక్కువగా ప్రస్తావించినట్లు తెలిపారు. తన జీవితాన్ని మార్చేసిన మధురమైన ఆనందాలు, చీకటినిరాశలగుండా సాగిన ప్రయాణానికి ఈ పుస్తకం ఓ నిదర్శనమని అభివర్ణించారు. ఆరు దశాబ్దాలుగా భారతదేశంలో తాను కళ్లారా చూసిన సామాజిక, రాజకీయ మార్పులపై పాఠకులకు ఒక ప్రత్యేకమైన దృక్పథాన్ని ఈ పుస్తకం అందిస్తుందని అన్నారు. న్యూయార్క్‌కు చెందిన ప్రముఖ ప్రచురణ సంస్థ 'ఆల్ఫ్రెడ్ ఏ క్నాఫ్' మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో సోనియా గాంధీ ఈ మేరకు వ్యాఖ్యానించారు.

**పుస్తకంలో ముఖ్య విషయాలు**

ఇందిరా గాంధీతో సోనియా గాంధీ పరిచయం, హిందీ నేర్చుకోవడానికి, చీరలు ధరించడానికి, భారతీయ వంటకాలను ఆస్వాదించడానికి సోనియా చేసిన ప్రయత్నాలు, అలాగే గాంధీ కుటుంబాన్ని కుదిపేసిన విషాదాలు ఇందులో నిక్షిప్తమయ్యాయి.

విమాన ప్రమాదంలో రాజీవ్ గాంధీ తమ్ముడు సంజయ్ గాంధీ మరణం, ఆ తర్వాత 1984లో ప్రధాని ఇందిరా గాంధీ దారుణ హత్య వంటి ఘోరాలు ఉన్నాయి.

తల్లి మరణానంతరం ప్రధాని అయిన రాజీవ్ గాంధీ, సరిగ్గా ఏడేళ్ల తర్వాత ఎన్నికల ప్రచారంలో దారుణంగా హత్యకు గురైన విషాద ఘటనలను కూడా ఈ పుస్తకం గుర్తుచేస్తుంది.

2004లో కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి ఎన్నికల్లో విజయం సాధించినప్పటికీ ప్రధాని పదవిని తిరస్కరించడం వెనుక ఉన్న అసలు కారణాలను సోనియా గాంధీ ఇందులో ప్రస్తావించారు.

**తొలి ముద్రణలో లక్ష కాపీల ప్రచురణ**



సోనియా తన జీవిత ప్రయాణంపై రాసిన 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' అనే పేరుతో వెలువడిన ఈ ఆత్మకథను నాఫ్ ప్రచురణ సంస్థ నవంబరు 10న హార్డ్‌కవర్, ఈబుక్ రూపంలో విడుదల చేయనుంది. దీని ఆడియో ఎడిషన్‌ను పెంగ్విన్ రాండమ్ హౌస్ ప్రచురించనుంది. తొలి ముద్రణలో లక్ష కాపీలను ముద్రించనున్నట్లు ప్రచురణకర్త తెలిపారు. ఈ స్వీయచరిత్రను ప్రచురించడం తమ ప్రచురణ సంస్థకు గౌరవంగా ఉందని నాఫ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, పబ్లిషర్ జోర్డాన్ పావ్లిన్ అన్నారు.

**ఇందిర కోడలిగా..**

యుద్ధానంతర ఇటలీలోని తన బాల్యం నుంచి రాజీవ్ గాంధీని వివాహం చేసుకుని అప్పటి ప్రధాని ఇందిరా గాంధీకి కోడలుగా భారత్‌లోని జీవితం వరకు సోనియా ప్రయాణాన్ని ఆమె ఆత్మకథ వివరిస్తుంది. ఈ పుస్తకం 1965లో ఇంగ్లాండ్‌లోని కేంబ్రిడ్జ్‌లో ప్రారంభమవుతుంది. అక్కడ 19 ఏళ్ల విద్యార్థినిగా ఉన్న సోనియా మైనో, రాజీవ్ గాంధీతో ప్రేమ, ఆ తర్వాత మూడేళ్లలో వారి వివాహ విషయాలను తెలుపుతుంది.

# 'జెన్ జీ'ని అంటూ ఆర్మీతో యువతి వాగ్వాదం

. వీకే సింగ్ ఏమన్నారంటే?

లద్దాఖ్ లోని మినామార్గ్ చెక్‌పోస్టు వద్ద భద్రతా సిబ్బందితో పర్యాటకురాలు వాగ్వాదానికి దిగిన వీడియో వైరల్ అయిన సంగతి తెలిసిందే. దీనిపై ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ వీకే సింగ్స్పందించారు. భద్రతా సిబ్బందిపై విమర్శలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. దేశాన్ని కాపాడే రక్షణ కవచంగా సాయుధ బలగాలు పని చేస్తున్నాయని ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సైనికులను అన్యాయంగా నిందించడం, నిరాధార ఆరోపణల చేయడం సరికాదన్నారు. దేశం కోసం త్యాగాలు చేస్తున్న సైనికులకు తాము అండగా ఉంటామని చెప్పారు.

అసలు ఏం జరిగిందంటే..

మినామార్గ్ ప్రాంతంలో ఉన్న చెక్‌పోస్టు వద్ద వాహనాలను గంటల పాటు నిలిపివేశారని ఓ పర్యాటకురాలు భద్రతా సిబ్బందిపై విరుచుకుపడింది. కుటుంబాలు, చిన్న పిల్లలతో ప్రయాణిస్తున్న వారిని అంతసేపు ఎందుకు నిలిపివేశారని ఆమె అక్కడి



సిబ్బందిని గట్టిగా ప్రశ్నించారు. తాము 'జెన్ జీ' తరానికి చెందిన వారమని, ఇలాంటి పరిస్థితులను అస్సలు సహించబోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం భద్రతా కాన్వాయ్ అక్కడికి రావడంతో, ఆమెను రోడ్డు పక్కకు వెళ్లాలని భద్రతా సిబ్బంది సూచించారు. రహదారిని కేవలం వీఐపీ కాన్వాయ్ కోసమే మూసివేశారని సదరు పర్యాటకురాలు ఆరోపించినట్లు సమాచారం. అయితే ఆ ఆరోపణలు ఎంత వరకు నిజమనేది ఇంకా పూర్తిగా తెలియాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. భద్రత, ప్రతికూల వాతావరణం, రోడ్డు పరిస్థితుల కారణంగా మినామార్గ్‌జోజిలా మార్గంలో వాహనాల రాకపోకలను నియంత్రించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

ఇదో కొత్త రకం బెదిరింపు.. ఒమర్ అబ్దుల్లా

ఈ వైరల్ వీడియోపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఘాటుగా స్పందించారు. పాత రోజుల్లో కొందరు రాజకీయ నాయకుల పిల్లలు 'నా తండ్రి ఎవరో నీకు తెలుసా? అంటూ బెదిరింపులకు దిగేవారని గుర్తు చేశారు. ఇప్పుడు ఈ 'మేము జెన్ జీ' అనేది ఒక కొత్త రకం బెదిరింపుగా మారిందని ఎద్దేవా చేశారు.

# రూ.20 లంచం కేసు.. 30ఏళ్లకు నిర్దోషులుగా తేలి..!



రూ.20 లంచం ఆరోపణలకు సంబంధించిన కేసులో సుప్రీం కోర్టు (Supreme Court) కీలక తీర్పు వెలువరించింది. గుజరాత్‌కు చెందిన ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులను నిర్దోషులుగా ప్రకటించింది. గతంలో వారిని దోషులుగా తేల్చుతూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం పక్కనపెట్టింది. లంచం డిమాండ్ చేసినట్లు ఎటువంటి ఆధారాలు లేవని, కేవలం రూ.20 రికవరీ చేసినంత మాత్రాన దోషిగా నిర్ధరించలేమని పేర్కొంది.

గుజరాత్ ఆనంద్ జిల్లాలోని బెద్రీ గ్రామానికి చెందిన ఓ విద్యార్థి 1996 ఫిబ్రవరిలో ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం స్థానిక పంచాయతీలో దరఖాస్తు చేసుకున్నాడు. అయితే అక్కడ పనిచేసే క్లర్క్ (ఓ గ్రామస్థాయి రెవెన్యూ అధికారి) రూ.120 లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అందులో రూ.100 తనకు కాగా.. మరో రూ.20లు ప్యూన్ కోసమని చెప్పాడు. దీంతో ఆ విద్యార్థి ఏసీబీని ఆశ్రయించాడు. ట్రాప్ చేసిన అధికారులు.. డబ్బులు తీసుకొని సర్టిఫికెట్ ఇస్తుండగా ప్యూన్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి వద్ద రూ.20 స్వాధీనం చేసుకున్నారు. మరో రూ.100 మాత్రం లభించలేదు.

ఈ కేసును విచారించిన ట్రయల్ కోర్టు.. ఇద్దరు ఉద్యోగులను దోషులుగా తేల్చుతూ 1999లో తీర్పు వెలువరించింది. అనంతరం గుజరాత్ హైకోర్టు కూడా దీనిని సమర్థించింది. అనంతరం ఈ కేసు సుప్రీం కోర్టుకు చేరింది. అయితే, తాను డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆధారాలు లేవని క్లర్క్, లంచం ఇవ్వాలని విద్యార్థిని ఎప్పుడూ అడగలేదని ప్యూన్ వాదించారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. బాధితుడి ప్రకటనలో వైరుధ్యాలున్నట్లు గుర్తించింది. అంతేకాకుండా.. మరుసటి రోజు ఈద్ ఉన్నందున విద్యార్థి తనకు రూ.20 ఇచ్చాడని ప్యూన్ చెప్పడం సమర్థనీయంగానే కనిపించిందని అభిప్రాయపడింది.

## కుక్కల భయంతో పది స్కూళ్లు.. మూడు రోజులు మూత


ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో వీధికుక్కల భయం కారణంగా పది పాఠశాలలను ఈ నెల 23వ తేదీ వరకు మూసి ఉంచాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. నారాయణ్‌బగడ్, నల్‌గావ్ ప్రాంతాల పరిధిలోని పది ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల పరిధిలో వీధికుక్కల విజృంభణ కారణంగా భయాందోళనలు నెలకొన్నట్లు స్థానిక అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం మూసివేతకు ఉత్తర్వులు ఇచ్చినట్లు చమోలీ ప్రధాన విద్యాధికారి ఆకాశ్ సారస్వత్ తెలిపారు.

## కార్పొరేషన్‌లో కుక్క పంచాయితీ!



ఇదేంటి కుక్క కూర్చొని మాట్లాడుతోంది అనుకుంటున్నారా? అవినీతి వ్యవహారంపై నిరసన తెలియజేయడానికి ఓ వ్యక్తి ఎంచుకున్న వినూత్న మార్గమిది. మధ్యప్రదేశ్‌లోని ఖండ్వా మున్సిపల్ కార్పొరేషన్‌లో కుక్కల కు.ని. చికిత్సల పేరు చెప్పి భారీ అవినీతి జరుగుతోందనే ఆరోపణలున్నాయి. దీనిపై దర్యాప్తు చేయాలని కార్పొరేషన్‌లో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న దీపక్ రాథోడ్ ఇలా ఓ వ్యక్తికి కోపంగా ఉన్న కుక్క మాస్క్‌ను తగిలించి అధికారుల వద్దకు ఫిర్యాదు చేయించడానికి తీసుకొచ్చారు. వారి వాదన విన్న కమిషనర్.. ఈ వ్యవహారంపై దర్యాప్తునకు కమిటీ ఏర్పాటు చేస్తామని, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## వాటిపై వీడియోలు చేస్తే.. రూ.లక్ష క్యాష్‌ప్రైజ్: ఇన్‌ఫ్లూయెన్సర్లకు బంపరాఫర్



సోషల్ మీడియా క్రియేటర్లు, ఇన్‌ఫ్లూయెన్సర్ల కు బిహార్ ప్రభుత్వం బంపర్ ఆఫర్ ఇచ్చింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వీడియోలు తీసి వైరల్ చేస్తే.. రూ.లక్ష వరకు నగదు బహుమతి అందుకోవచ్చని ప్రకటించింది. ఈ మేరకు తమ సోషల్ మీడియా పాలసీలో చేసిన సవరణలకు.. బిహార్ క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

కొత్త నిబంధనల ప్రకారం.. ప్రభుత్వం సాధించిన ఘనతలు, సంక్షేమ పథకాలు, కార్యక్రమాలకు సంబంధించిన కంటెంట్‌తో క్రియేటర్లు వీడియోలు రూపొందించి నగదు అందుకోవచ్చు. లక్ష వ్యూస్ వచ్చిన వీడియోలకు రూ.10వేల వరకు ఇవ్వనున్నారు. దానిలెక్కన.. 10లక్షల వీక్షణలు ఉన్న వీడియోలకు రూ.లక్ష వరకు నగదు బహుమతి అందిస్తామని బిహార్ ప్రభుత్వం పేర్కొంది. పది లక్షల వ్యూస్ దాటినా.. నగదు గరిష్ఠ పరిమితి మాత్రం రూ.లక్ష వరకే ఉండనున్నట్లు వెల్లడించింది. అయితే, ప్రతి వైరల్ వీడియోకు ఈ మొత్తం రాదు. ప్రభుత్వం విధించిన షరతులకు అనుగుణంగా ఉన్న వీడియోలకే ఈ ఆఫర్ వర్తిస్తుందని ఈ రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్, కంటెంట్ నాణ్యత, వీక్షణల అధికారిక వెరిఫికేషన్ చేసిన తర్వాత ఈ చెల్లింపులు చేస్తామని బిహార్ సర్కారు వెల్లడించింది. ఈ స్కీమ్ కోసం సోషల్ మీడియా క్రియేటర్లు, ఇన్‌ఫ్లూయెన్సర్లు.. సమాచార, ప్రజా సంబంధ విభాగంలో తమ పేరును నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విభాగ అనుమతి తీసుకోకుండా చేసే వీడియోలను పరిగణనలోకి తీసుకోరట. అంతేకాదు.. నమోదిత క్రియేటర్ల సామాజిక మాధ్యమ ఖాతాలు, ఛానెళ్ల ఫాలోవర్లను నిరంతరం చెక్ చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## పాకిస్థాన్ యాక్షన్.. భారత్ రియాక్షన్..

ఇస్లామాబాద్‌లో భారత్ హైకమిషన్ వద్ద పాక్ వ్యవహరించిన తీరుకు దిల్లీలో సమాధానం లభించింది. ఇక్కడి పాక్ హైకమిషన్ ఎదుట అనుమతిలేని నిర్మాణాలను అధికారులు తొలగించారు. ముఖ్యంగా క్యూ నిర్వహణకు ఏర్పాటు చేసినవి, వీసా విభాగం వద్ద అమర్చిన లైనర్లను తీసేసింది. ఈ క్రమంలో అక్రమంగా నిర్మించిన గోడను కూడా తొలగించారు. ఇవి పాక్ హైకమిషన్ ప్రాంగణం హద్దులను దాటి బయటకు ఉండటంతో చర్యలు తీసుకొన్నారు.

పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో భారత హైకమిషన్ వద్ద రక్షణ కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లను అక్కడి అధికారులను తొలగించారు. దీంతోపాటు భారత హైకమిషన్ ఎదుట పార్కింగ్‌ను కూడా తొలగించారు. ఈ ఘటన చోటు చేసుకొన్న కొన్ని గంటల్లోనే భారత్ రియాక్షన్ పాక్ హైకమిషన్ ఎదుట కనిపించింది.






# సవరిస్తేనే రిజర్వేషన్లకు న్యాయం!

పట్టణ స్థానిక సంస్థలైన నగర పంచాయతీలు, మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థలలో చైర్‌పర్సన్, మేయర్ పోస్టులకు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డు తెగలు, వెనుకబడిన తరగతులు, మహిళలకు రిజర్వేషన్ కల్పించిన మొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు గుర్తింపు ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 123 పట్టణ స్థానిక సంస్థలలో 4 షెడ్యూల్డు తెగలకు, 17 షెడ్యూల్డు కులాలకు, 40 వెనుకబడిన తరగతులకు కేటాయించారు. ఆయా స్థానిక సంస్థలలో ఉన్న మొత్తం సీట్లలో– రిజర్వేషన్లతో కూడా కలిపి 50 శాతానికి తగ్గకుండా మహిళలకు కేటాయించాలని నిబంధనలు చెబుతున్నాయి. అలాగే, నగర పంచాయతీలు, మునిసిపాలిటీలలో వార్డు మెంబర్లకు, నగరపాలక సంస్థలలో కార్పొరేటర్ల పదవులకు రొటేషన్ పద్ధతిన రిజర్వేషన్లు అమలవుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ పురపాలక సంఘాల చట్టం–1965, సవరించిన ఆంధ్రప్రదేశ్ నగరపాలక సంస్థల చట్టం– 1994 ప్రకారం... పట్టణ స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు అమలు చేయాలనే నిబంధనలు లేకపోయినా, 74వ, భారత రాజ్యాంగ సవరణ చట్టం 'ఆర్టికల్ 243–టి' ప్రకారం నగర పంచాయతీలు, పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలలో ఆయా ప్రత్యేక వర్గాలకు రిజర్వేషన్లు కల్పించారు.

ప్రస్తుతం జీవో 59, తేది 10.09.2021 ప్రకారం, రాష్ట్రంలోని నగర పంచాయతీలు, మున్సిపాలిటీలలో రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. అదే విధంగా జీవో 60, తేది 10.09.2021ని అనుసరించి ప్రస్తుతం నగరపాలక సంస్థలలో ఆయా కేటగిరీలకు చెందినవారికి రిజర్వేషన్లు కేటాయిస్తున్నారు. ఈ రిజర్వేషన్లు ఆయా వర్గాల జనాభాకు తగినట్లుగా దామాషా ప్రకారం రొటేషన్ పద్ధతిలో ఉండాలనీ, మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదనీ అమలులో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు తెలియజేస్తున్నాయి.

పట్టణ స్థానిక సంస్థలలో చైర్‌పర్సన్, మేయర్ పోస్టులకున్నట్టుగా వైస్ చైర్‌పర్సన్, డిప్యూటీ మేయర్ పోస్టులకు రిజర్వేషన్లు లేని కారణంగా, అసలు రిజర్వేషన్ పాలసీ అనే దానికే అర్థం లేకుండాపోతోంది. ఎందుకంటే– ఏదైనా ఒక మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ సీటు షెడ్యూల్డు కులాలకు కేటాయించినప్పుడు, ఏదైనా కారణంతో... అంటే చైర్‌పర్సన్ అనారోగ్యం లేదా పదవికి రాజీనామా చేయటం వంటి కారణాల వల్ల ఆ పదవికి తాత్కాలికంగా ఖాళీ ఏర్పడితే, ఆ పదవిలో కూర్చునే వ్యక్తి షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తే అయివుండాలి. అలాగే, షెడ్యూల్డ్ తెగలకు, వెనుకబడిన కులాలకు, మహిళలకు కేటాయించిన చైర్‌పర్సన్ పోస్టుల విషయంలో కూడా, ఆయా పదవులకు తాత్కాలికంగా ఖాళీ ఏర్పడితే, ఆయా వర్గాలకు సంబంధించిన వ్యక్తులే ఆ పదవులను అలంకరించాలి. కానీ, వాస్తవ పరిస్థితులలో అలా జరగటం లేదు.

రాష్ట్రంలో చాలా పట్టణ స్థానిక సంస్థలలో రిజర్వేషన్ విధానం సక్రమంగా అమలు జరగటం లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీల స్థానంలో ఆయా వర్గాలకు చెందనివారు, మహిళల స్థానంలో పురుషులు అధికారం పంచుకుంటున్నారు. ఇది రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్ స్ఫూర్తికి పూర్తి వ్యతిరేకం, ఆయా వర్గాల వారికి అన్యాయంగా భావించాల్సి ఉంటుంది.

పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకలలో చట్టాలను ఏనాడో సవరించుకున్న ఫలితంగా అక్కడ డిప్యూటీ మేయర్ పదవికి కూడా మేయర్ పదవికి చెందిన కేటగిరీ ననుసరించి రిజర్వేషన్ వర్తిస్తుంది. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం పట్టణ స్థానిక సంస్థల చట్టాలు సవరణకు నోచుకోకపోవటంతో రిజర్వేషన్ స్ఫూర్తికి భంగం కలుగుతోంది. నిజానికి మన రాష్ట్రంలో కూడా 2021లో వైస్ చైర్‌పర్సన్, డిప్యూటీ మేయర్ పదవులకు రిజర్వేషన్ కల్పించే ప్రయత్నం జరిగింది. అయితే, ఆ రిజర్వేషన్లు ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా కాకుండా చట్ట సవరణ ద్వారానే జరగాలనే కారణంతో అప్పటి ప్రభుత్వం ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది. అదే సంవత్సరం జూలైలో జారీ చేసిన జీవో 66 ద్వారా మున్సిపాలిటీలలో ఇద్దరు వైస్ చైర్‌పర్సన్‌లు, నగరపాలక సంస్థలలో ఇద్దరు డిప్యూటీ మేయర్లను ఎన్నుకుంటున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న వైస్ చైర్‌పర్సన్, డిప్యూటీ మేయర్ పదవుల విషయంలో పైన తెలిపిన పరిస్థితులు మారి, ఆయా వర్గాలకు కేటాయించిన రిజర్వేషన్లు సక్రమంగా అమలు జరగాలంటే ప్రస్తుత చట్టాలను సవరించాలి. అప్పడే రాజ్యాంగం ద్వారా షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, వెనుకబడిన వర్గాల మహిళలకు ప్రత్యేకంగా కేటాయించిన రిజర్వేషన్లు పక్కాగా అమలు అవుతాయి. దీంతో రిజర్వేషన్ల వెనకున్న అసలు ఉద్దేశ్యం పూర్తిగా నెరవేరుతుంది. ఈ సంవత్సరాంతంలో జరగనున్న ఎన్నికలలోనైనా ప్రతి పట్టణ స్థానిక సంస్థలలోనూ రెండో అత్యున్నత ప్రజాప్రతినిధి పదవికి కూడా ప్రత్యేక రిజర్వేషన్‌ను అమలుచేసి, ఆయా వర్గాలకు సముచితమైన అవకాశాలు, ప్రాతినిధ్యం కల్పించాలి. అప్పడే రాష్ట్రంలోని నగర పంచాయతీలు, పురపాలక సంఘాలు నగరపాలక సంస్థల పాలనా వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం సాధ్యమవుతుంది.



# రణరంగంలో స్వదేశీ ఏఐ

ఆధునిక యుద్ధతంత్రం వేగంగా మారుతోంది. సైనికులు, ఫైటర్ విమానాలు, క్షిపణులు, యుద్ధ నౌకలకు తోడుగా ఏఐ బరిలో దిగుతోంది. నిరుడు పాకిస్థాన్ ఉగ్రస్థావరాలు లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లోనూ, ఇటీవల ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులలోనూ ఏఐ, మెటా డేటా, అల్గారిథమ్‌లు నిర్ణయాత్మక పాత్ర పోషించాయి. అందుకే ఈ విషయంలో గత 26 సంవత్సరాలుగా పాకిస్థాన్ ఏయే స్థావరాల నుంచి ఉగ్రవాదులను భారత్‌పైకి ఉసిగొల్పిందనే దీర్ఘకాలిక డేటాను ఏఐకి అందించి, విశ్లేషించడం ద్వారా తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను గుర్తించి, గురిచూసి కొట్టి నాశనం చేశారు. సరిహద్దు వెంబడి ఉగ్రవాద శిబిరాలను ఏఐ 94 శాతం కచ్చితత్వంతో గుర్తించి మన సాయుధ దళాలకు దిశానిర్దేశం చేసింది. భారత్ ఏఐని పరిమిత లక్ష్యం కోసం, పరిమిత ప్రదేశాలపై ప్రయోగించగా- అమెరికా, ఇజ్రాయెల్‌లు ఇరాన్‌పై విస్తృత విధ్వంసం కోసం మేవెన్-క్లాడ్ ఏఐ అనుసంధానాలను ఉపయోగించాయి. ఇండియా ఇంత విస్తృతంగా పాక్‌పై దాడికి దిగలేదు. పౌరులకు ప్రాణనష్టం లేకుండా, ఉగ్ర స్థావరాలపై మాత్రమే దాడులు చేసింది. అనుకున్నది సాధించగానే దాడులను విరమించింది.



**లక్ష్యాల ఛేదనలో...**

పాకిస్థానీ ఉగ్రవాద కేంద్రాలపై రఫేల్ యుద్ధ విమానాలు, స్కాల్ప్ క్షిపణులతో దాడి చేయడానికి ఏఐని భారత్ సమర్థంగా ఉపయోగించుకుంది. భూ మార్గంలో సైనికులను పాక్‌పై దాడికి పంపకుండానే విమానాలతో శత్రు భూభాగంలోకి లోతుగా చొచ్చుకెళ్లి దాడి చేయగలిగింది. పాక్ ఫైటర్ విమానాలు, డ్రోన్లను ఎదుర్కోవడానికి ఆకాశ్‌తీర్ గగనతల రక్షణ నెట్‌వర్క్ వంటి స్వదేశీ సాధనాలు, తదితర వ్యవస్థలను ఉపయోగించింది. దాడి జరిపే సమయంలో పాకిస్థాన్‌లో, ముఖ్యంగా ఉగ్రవాద స్థావరాలు ఉన్న ప్రదేశాలలో గాలి, వర్షం తదితర వాతావరణ అంశాలను విశ్లేషించడానికి భారత సైన్యం కోసం ప్రత్యేకంగా రూపొందించిన వాతావరణ ఏఐ తోడ్పడింది. అది కచ్చితమైన రియల్‌టైం వాతావరణ అంచనాలను అందించి, క్షిపణులతో, విమానాలతో నిశితంగా దాడులు జరపడానికి తోడ్పడింది. అరుణాచల్‌ప్రదేశ్‌లో వాస్తవాధీన రేఖ వెంబడి చైనా సేనల కదలికల గురించి డ్రోన్లు, ఉపగ్రహాలు, రాడార్లు అందించే చిత్రాలు, డేటాను విశ్లేషించడానికీ ఏఐని ఉపయోగిస్తున్నారు. భారత్ తన రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేసుకునేందుకు సొంత 'సావరిన్ ఏఐ'ని అభివృద్ధి చేస్తోంది. భారతదేశం దీన్ని తన వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని రక్షించుకోవడానికి, అత్యంత సున్నితమైన రక్షణ డేటాను కాపాడుకోవడానికి, విదేశీ సాఫ్ట్‌వేర్ ఉపగ్రహాలు లేదా పబ్లిక్ క్లౌడ్ మౌలిక సదుపాయాలపై ఆధారపడకుండా యుద్ధం చేయడానికి ఉపయోగిస్తోంది. ఎలక్ట్రానిక్ ఇంటెలిజెన్స్, ఉపగ్రహ చిత్రాలు, ప్రత్యక్ష యుద్ధభూమి టెలిమెట్రీని సురక్షితంగా ప్రాసెస్ చేయడానికి సావరిన్ ఏఐ మీద ఇండియా ఆధారపడుతోంది. డేటా లీక్‌లను నివారించడానికి అంతర్జాతీయ ఇంటర్నెట్ నుంచి సావరిన్ ఏఐ వేదికలను పూర్తిగా వేరుచేస్తారు.

విద్యుత్‌ఏఐ అనేది భారత సైన్యం చేపట్టిన స్వదేశీ ఎడ్జ్‌కంప్యూటర్ విజన్ ప్లాట్‌ఫారం. ఏకకాలంలో అనేక శత్రులక్ష్యాలను ఇది ట్రాక్ చేస్తుంది. మైనస్ 40 50 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు మించిన ఉష్ణోగ్రతలోనూ పనిచేస్తుంది. సర్వం ఏఐచాణక్య అనేది మన రక్షణ, ఆర్థిక సమాచారాన్ని విశ్లేషించడానికి విదేశీ ఆధారిత క్లౌడ్‌కు దూరంగా ఆఫ్‌లైన్‌లో పనిచేస్తుంది. సైనిక, గూఢచారి డేటాను స్థానిక సర్వర్లలో భద్రపరచడం ద్వారా విదేశీ క్లౌడ్ సంస్థలకు దూరంగా ఉంచుతుంది.

**సైన్యం కోసం...**

భారత్‌జెన్ పరమ్ 2, సర్వం ఏఐ వంటి సావరిన్ ఫౌండేషనల్ సిస్టమ్స్ 22 భారతీయ భాషలలో పనిచేస్తాయి. సైనిక కమ్యూనికేషన్ విభాగ సిబ్బంది, సైన్యాధికారుల మధ్య సంభాషణకు తోడ్పడతాయి. వీటిని ఉపయోగించుకోవడానికి ప్రత్యేక సాంకేతిక నైపుణ్యాలు ఉండనక్కర్లేదు. కాబట్టి దళాధిపతులు వివిధభాషలు మాట్లాడే సాధారణ సైనికులతోనూ తేలికగా సంభాషించగలుగుతారు. సావరిన్ ఏఐ సిస్టమ్‌లను ఉపయోగించడం ద్వారా భారత సాయుధ దళాలు చాట్‌జీపీటీ, జెమినై, క్లాడ్ వంటి విదేశీ ఏఐలతో నిమిత్తం లేకుండా పోరాటాన్ని నిర్వహించగలవు. విదేశీ క్లౌడ్‌లపై ఆధారపడటాన్ని తగ్గించి, వర్క్‌లోడ్‌లను స్థానికంగా ఉంచడానికి, భారతదేశం తన హార్డ్‌వేర్ మౌలిక సదుపాయాలను పెంచుకుంటోంది. ఇండియా ఏఐ మిషన్ తన నేషనల్ కంప్యూట్ కెపాసిటీ పోర్టల్‌కు 58వేలకంటే ఎక్కువ జీపీయూలను కేటాయించింది. భారతీయ స్టార్టప్‌లు, రక్షణ పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు కలిసి 'ఏఐ యాజ్ ఏ సర్వీస్ ప్లాట్‌ఫారం'గా ప్రాజెక్ట్ ఏకంను రూపొందించాయి. దీన్ని 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యంతో విదేశీ సాఫ్ట్‌వేర్ లేదా క్లౌడ్ సిస్టమ్‌లపై ఆధారపడకుండా భారత సైన్యం కోసమే ప్రత్యేకంగా తయారు చేశారు. పోరాట ఏఐ రూపకల్పనలో అమెరికా, చైనాలకు దీటుగా భారత్ ముందడుగు వేస్తోందన్నది వాస్తవం.

# జార్ఖండ్‌లో 'జంతర్ మంతర్'

ఉన్నత చదువులకూ, ఉద్యోగాలకూ పోటీ పరీక్షలు నిర్వహించే ప్రభుత్వాలు వాటిల్లో అవకతవకలు బయపడినప్పుడు నిమ్మకు నీరెత్తినట్టు ఉండటం, విశ్వసనీయ సంస్థలతో దర్యాప్తు చేయించటానికి మొండికేయటం ఈమధ్య కనబడుతున్న వింత ధోరణి. సోమవారం జార్ఖండ్‌లోని రాంచీలో నిరుద్యోగ యువత, విద్యార్థులు 'అసెంబ్లీ ముట్టడి' నిర్వహించినప్పుడు చానెళ్లలో కనబడిన దృశ్యాలు విస్తుగొలిపాయి. హఠాత్తుగా చూసినవారికి అది జంతర్ మంతరో, జార్ఖండో తెలియని స్థితి ఏర్పడింది. జార్ఖండ్‌లో జేఎంఎం నాయకత్వానగల పాలక కూటమిలో కాంగ్రెస్, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ భాగస్వామ్య పక్షాలుగా ఉన్నాయి. కానీ తమ డిమాండ్లు నెరవేరటం కోసం రాంచీలో యువత 16 రోజులుగా పోరాడాల్సి వస్తోంది. ఉద్యమకారుల డిమాండ్లలో 98 శాతం నెరవేర్చామని జార్ఖండ్ ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. గత నెల 22న ఈ వ్యవహారంలో పదవి నుంచి తప్పుకొన్న జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(జేపీఎస్సీ) చైర్మన్ ఎల్. ఖియాంగ్టేను తాజాగా అరెస్టు చేశారు. కమిషన్‌లోని ముగ్గురు సభ్యులు గవర్నర్‌కు రాజీనామాలు సమర్పించారు. కానీ ఉద్యమకారుల ప్రధాన డిమాండ్ అయిన సీబీఐ దర్యాప్తునకు ప్రభుత్వం ససేమిరా అంటున్నది.



నిరుద్యోగ యువతతో ముడిపడి ఉన్న సమస్యలపై ప్రభుత్వాల స్పందనెలా ఉంటుందో జంతర్ మంతర్‌తోపాటు జార్ఖండ్ ఉద్యమం కూడా నిరూపించింది. సర్కారీ కొలువు లభించాలని యువతీయువకులు ఎంతగానో తపిస్తారు. అందుకోసం చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మరిచి చదువుల్లో మునిగిపోతారు. శిక్షణ కోసం వేలకు వేలు వెచ్చిస్తారు. తీరా ప్రశ్నపత్రం లీకయిందంటే, అయోగ్యులు పైపైకి ఎగబాకారని తెలిస్తే... ఆ పిల్లలు, వారి తల్లిదండ్రులు చెప్పనలవికాని వేదనను అనుభవిస్తారు. వారి కలల ప్రపంచం ఒక్కసారిగా కుప్పకూలుతుంది. లక్షలాదిమంది జీవితాలతో ఆడుకున్న ఒక పెద్ద కుంభకోణం బయటపడిన వెంటనే చిత్తశుద్ధిగల ప్రభుత్వమైతే సంబంధిత మంత్రి చేత రాజీనామా చేయిస్తుంది. ఆ పరీక్షల నిర్వహణలో పాలుపంచుకున్న వారందరినీ అరెస్టు చేస్తుంది. పరీక్ష ఫలితాలను రద్దుచేస్తుంది. ఇందుకోసం యువత రోడ్డెక్కాల్సి వచ్చిందంటే పాలకులు సిగ్గుపడాలి.

తప్పు జరిగిందని తెలిసినా జార్ఖండ్ ప్రభుత్వం సీబీఐ దర్యాప్తు డిమాండ్‌ను ఎందుకు తిరస్కరిస్తోంది? అదొక్కటే కాదు... ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం కూడా డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతవకలపై, వేలంపాటలపై సీబీఐతో దర్యాప్తు చేయించడానికి మొండికేస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ నిర్వహిస్తున్న నిరసనలపై రౌడీ ఎమ్మెల్యేలతో దాడులు చేయిస్తోంది. ఈ వ్యవహారంలో విద్యామంత్రి లోకేశ్ మీడియాతో మాట్లాడటానికి జంకి, ప్రభుత్వాధికారుల్ని ముందుకు తోస్తున్నారు. మరోవైపు చర్చకు సిద్ధమని సవాళ్లు విసురుతున్నారు. సాక్షాత్తూ అభ్యర్థులే తమకు జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటుతుంటే... ఇలా బీరాలు పోవడం ఆయన గారికి సిగ్గనిపించడం లేదు. కేంద్రంలో తమ కూటమి ఏలుబడే ఉన్నా, సీబీఐ దర్యాప్తు అనగానే ఏపీ సర్కారు నిలువెల్లా వణుకుతోంది.

యువత ఉద్యమాల సందర్భంగా రాజకీయ పక్షాల ద్వంద్వవైఖరి తేటతెల్లం అయింది. జంతర్ మంతర్ ఆందోళనపై ముద్రలేసి, దాన్ని నీరుగార్చాలని చూసిన బీజేపీ చివరాఖరికి తన వైఖరిని మార్చుకుంది. కానీ జార్ఖండ్ ఆందోళనలో అది చురుగ్గా పాల్గొంటున్నది. ఢిల్లీ ఉద్యమంలో మౌనప్రేక్షకపాత్ర వహించి ఆఖరి దశలో మేల్కొన్న కాంగ్రెస్... జార్ఖండ్‌లో పాలక కూటమిలో ఉంటూ కూడా ప్రభుత్వానికి నచ్చజెప్పలేకపోయింది. పైగా మీ డిమాండ్లేమిటో చెప్పండని పదిరోజులైనాక కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఉద్యమకారుల్ని అడిగారు. ఏపీలో పాలక కూటమిలో ఉన్న బీజేపీ అక్కడి డీఎస్సీ నియామకాల స్కామ్‌పై నోరెత్తదు. కానీ జార్ఖండ్‌లో మాత్రం నేనున్నానంటూ ముందుకొస్తుంది. ఇవన్నీ యువత గుర్తించరనుకోవటం ఆ పక్షాల తెలివితక్కువతనం. వెంటనే ప్రభుత్వాలు ఉన్నతస్థాయి దర్యాప్తునకు సిద్ధపడి లీకుల వెనకుండే మాఫియాలనూ, వారికి అండదండలందించే బడా నేతలనూ బయటకు లాగాలి. ఇతర వాగ్దానాల సంగతలావుంచి కనీసం పరీక్షలైనా సక్రమంగా నిర్వహించలేకుంటే యువత క్షమించదు.

# 'డిజిటల్' భారం సరికాదు!

ప్రారంభమై పదేళ్లు గడిచాక యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా సాగే డిజిటల్ లావాదేవీలకు వడ్డింపు మొదలుకాబోతోంది. లోక్‌సభలో గురువారం గందరగోళం నెలకొన్నప్పుడు, ఎలాంటి చర్చా లేకుండా ఇందుకు సంబంధించిన బిల్లుఆమోదం పొందిందని మీడియా కథనాలు చెబుతున్నాయి. తక్షణమే వర్తించకపోయినా భవిష్యత్తులో ఎప్పుడైనా యూపీఐ లావాదేవీలపై రుసుము వసూలు చేసేందుకు ఈ బిల్లు అధికారమిస్తోంది. ఫీజంటూ వసూలు చేస్తే రూ. 2,000కు మించిన లావాదేవీలపై, అది కూడా వార్షిక టర్నోవర్ కోటిన్నర మించే వ్యాపారులకే వర్తిస్తుందని సన్నాయినొక్కులు నొక్కుతున్నారు. విధించబోయే ఫీజు కూడా ఒక్కో లావాదేవీకి 0.25 శాతం లేదా 0.5 శాతం ఉండొచ్చన్నది మరో మాట. సాధారణ యూపీఐ వినియోగదారులు సాగించే లావాదేవీలన్నీ ఎప్పటిలా యధాతథంగా ఉంటాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. దీన్ని విశ్వసించలేం. ఆదాయం పెంచుకునేందుకు అవకాశం ఉన్నప్పుడు ఆ చట్టానికి ముందూ మునుపూ సవరణలు రాబోవని చెప్పలేం. ఆ సంగతలావుంచి తమపై రుద్దే ఈ చార్జీల్ని వ్యాపారులు వినియోగదారుకే బదిలీ చేస్తారు. ఆ అవకాశం లేకుండా తగిన నియంత్రణలు విధిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వగలదా?




దేశంలో ఆర్థిక సంస్కరణల ఆగమనంతోపాటే పాలకులు కొత్త రాగం అందు కున్నారు. ప్రభుత్వాలు పాలించాలి తప్ప వ్యాపారం చేయడమేమిటన్నదే దాని సారాంశం. ఆ వంకన లక్షలాదిమంది సిబ్బంది పనిచేసే దిగ్గజ పబ్లిక్ రంగ సంస్థలు అనేకం కనుమరుగయ్యాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు గర్వకారణంగా నిలిచి, ఆసియాలోనే అతిపెద్దదైన నిజాం షుగర్స్ కాస్తా ఆనాటి సీఎం చంద్రబాబు పుణ్యమా అని మూతబడింది. కోట్లాది రూపాయల విలువైన దాని ఆస్తుల్ని కారుచవగ్గా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారు. నిజాం షుగర్స్ మాదిరిగా మరెన్నో పబ్లిక్ రంగసంస్థలకు తాళాలుపడ్డాయి. వ్యాపారమంటే వదులుకున్నాయి గానీ... ప్రభుత్వాలకు వ్యాపార దృక్పథం పోలేదని యూపీఐ లావాదేవీలపై ఫీజు వసూలు ఆలోచన నిరూపిస్తోంది. యూపీఐ, రూపే వంటివి ఉచిత సేవలు అందించటంవల్ల తమవీసా, మాస్టర్‌కార్డ్ వగైరా ప్లాట్‌ఫాంలు ఎదగటంలేదన్న అమెరికా ఆక్రోశమే తాజా నిర్ణయానికి కారణమని కొందరి ఆరోపణ.

బ్రెజిల్‌పై సైతం అమెరికా ఈ మాదిరి ఒత్తిడే తెచ్చినా అది అంగీకరించలేదని కూడా చెబుతున్నారు. వాటి నిజానిజాల సంగతలావుంచి, ప్రభుత్వం చెప్పే కారణాలు మాత్రం ఎప్పటినుంచో వింటున్నవే. యూపీఐ వ్యవస్థ నిర్వహణ తడిసిమోపెడు భారమవుతున్నదని బ్యాంకులూ, పేమెంట్ ప్రాసెసర్లూ గగ్గోలు పెడుతుండటంవల్ల ఇది తప్పడం లేదట! లావాదేవీల నిర్వహణ భారంలోకొంతమేర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. దాంతోపాటు ఈ లావాదేవీలు పెరిగాక బ్యాంకులు తమ సిబ్బందిని తగ్గించుకోలేదా? ఆమేరకు వాటి ఖర్చు తగ్గలేదా? అదీగాక గత దశాబ్దకాలంలో బ్యాంకింగ్ సేవల చార్జీలు, కనీస మొత్తం ఖాతాలో లేదన్న కారణంతో వసూలు చేసే పెనాల్టీ, పరిమితికి మించిన లావాదేవీలపై చార్జీలు, ఎస్ఎంఎస్‌సందేశాలకని, డెబిట్ కార్డు నిర్వహణ వ్యయమని బ్యాంకులు వసూలు చేస్తున్నాయి. ఇవన్నీ చాలకనా ఈ కొత్త ఆలోచనలు!

ఈ పదేళ్లలో డిజిటల్ లావాదేవీలు అపారంగా పెరిగాయి. అయినా ఈ పెరుగుదల తగినంతగా లేదని ఆర్థిక నిపుణులంటున్నారు. గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే వగైరాలు వినియోగిస్తున్నవారు వాటిని బ్యాంకింగ్ సేవలుగా చూడటం లేదు... ఆ యాప్‌లను పర్స్‌గా పరిగణించి లావాదేవీలు జరుపుకొంటున్నారు. అలవాటు చేసినట్టే చేసి, దాన్నుంచి కూడా ఆదాయం పొందాలనుకోవటం సరికాదు. ప్రస్తుతం దేశంలో డిజిటల్ లావాదేవీల వినియోగదారుల సంఖ్య 50 కోట్లని చెబుతున్నారు. అయితే ఒక వినియోగదారు సగటున చేసే లావాదేవీలు చూస్తే ప్రపంచ స్థాయికన్నా తక్కువే. అలాగే లావాదేవీల్లో 86 శాతం రూ.500, అంతకన్నా తక్కువ మొత్తాలేనని అంటారు. మొదట్లో ఉన్నంత వృద్ధి ఇటీవలి సంవత్సరాల్లో కనబడటం లేదని కూడా అంటున్నారు. ఇదంతా ఏం చెబుతోంది? ఎంతో వెసులుబాటుగా, ఉపయోగకరంగా ఉన్న ఈ లావాదేవీలు మరింత విస్తరించాల్సిన తరుణంలో వాటిని నిరుత్సాహపరిచేలా, జనం మళ్లీ నగదు వైపు మొగ్గేలా చేయటం వింతకాదా? ప్రభుత్వం ఆలోచించాలి.

# అనంతగిరి ఎంఈఓపై అవినీతి ఆరోపణలు..



**- ఉన్నతాధికారులకు ఉపాధ్యాయ సంఘాల ఫిర్యాదు**

**అనంతగిరి, ఆగస్టు 20:అనంత జనశక్తి న్యూస్**

అనంతగిరి మండల విద్యాశాఖ అధికారి కే. బాలాజీపై అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారంటూ వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. సిబ్బంది వేతనాలు, విద్యార్థుల సంక్షేమ పథకాలు, కార్యాలయ పరిపాలనా వ్యవహారాల్లో అవకతవకలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు.గురువారం డీటీఎఫ్, ఏపీటీఎఫ్257, పీఆర్టీయూ, బీటీఏ సంఘాల ప్రతినిధులు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ నిశాంతి, జిల్లా విద్యాశాఖ అధికారి భానుమూర్తిరాజును కలిసి ఫిర్యాదు అందజేశారు. ఆరోపణలకు సంబంధించిన పత్రాలు, ఆధారాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది వేతనాలు, బిల్లులు, ఇతర ఆర్థిక వ్యవహారాల్లో నిబంధనలు పాటించలేదని సంఘాల నాయకులు ఆరోపించారు. అలాగే విద్యార్థుల సంక్షేమ పథకాల అమలులోనూ అవకతవకలు జరిగాయని పేర్కొన్నారు. నిధులు, సామగ్రి, పథకాల అమలుకు సంబంధించిన రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించాలని కోరారు. ఎంఈఓ కార్యాలయానికి సంబంధించిన బిల్లులు, వేతన వివరాలు, సంక్షేమ పథకాల రికార్డులను తనిఖీ చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని సంఘాల నాయకులు తెలిపారు.ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి, అవకతవకలు నిజమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అయితే ఎంఈఓ కే. బాలాజీపై వచ్చిన ఆరోపణలు ప్రస్తుతం ఉపాధ్యాయ సంఘాలు చేసిన ఫిర్యాదులకే పరిమితం. అధికారుల విచారణ అనంతరం వాస్తవాలు తేలాల్సి ఉంది.

# లుంగపర్తిలో మలేరియాపై అవగాహన ర్యాలీ




**అనంతగిరి, ఆగస్టు 20:అనంత జనశక్తి న్యూస్**

లుంగపర్తి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పెదబిడ్డ హైస్కూల్ విద్యార్థులతో గురువారం మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ పి. మంజు భార్గవి నేతృత్వంలో విద్యార్థులు ప్లకార్డులు చేతబట్టి మలేరియా నివారణపై నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ మంజు భార్గవి మాట్లాడుతూ పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమతెరలు వినియోగించాలని సూచించారు. జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అనంతగిరిలో మలేరియాపై అవగాహన ర్యాలీ



**అనంతగిరి, ఆగస్టు 20:అనంత జనశక్తి న్యూస్**

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అనంతగిరి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ కళ్యాణ్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో 'మలేరియాను తరిమికొడదాం-ఆరోగ్యాన్ని కాపాడుకుందాం' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణ్ మాట్లాడుతూ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని సూచించారు. దోమతెరలు వినియోగించాలని, జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే పీహెచ్‌సీని సంప్రదించాలని తెలిపారు. మలేరియా పరీక్షలు, చికిత్స, మందులు ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో పీహెచ్ఎన్ పి. వెంకటలక్ష్మి, మలేరియా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు,ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# అసెంబ్లీకి రాకుండా పారిపోతున్న జగన్

(మొదటి పేజీ తరువాయి)

**వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించ లేదని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు డీఎస్సీ నిర్వహించ లేకపోయారు.. ప్రస్తుతం అసెంబ్లీలో చర్చకు రాకుండా పారిపోతు న్నారంటూ జగన్‌కు చురకలంటించారు పరీక్షల వ్యవస్థపై అవగాహన లేని వ్యక్తి ఇప్పుడు ప్రశ్నలు లేవనెత్తుతున్నారంటూ జగన్‌పై మంత్రి లోకేశ్ నిప్పులు చెరిగారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ మధ్య తేడా తెలియని వైఎస్ జగన్‌కు పరీక్షలపై మాట్లాడే అర్హత ఉందా? అంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు మంత్రి లోకేశ్ తన ఎక్స్ ఖాతా వేదికగా జగన్‌కు కౌంటర్ ఇచ్చారు.**

# వెట్టిచాకిరీ నుంచి 40 మంది కార్మికులకు విముక్తి

- **శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఉక్కుపాదం**
- **కొత్తచెరువు (తలమర్ల), గోరంట్ల బొగ్గు భట్టీల నుండి 40 మంది కార్మికుల రక్షణ.**
- **కలెక్టర్ ఆదేశాలతో 'వెట్టిచాకిరీ నిరోధక చట్టం' కింద రిలీజ్ సర్టిఫికెట్లు, రుణాల రద్దు.**
- **తక్షణ ఆర్థిక సాయం, వైద్యం మరియు మహారాష్ట్రకు ప్రత్యేక రవాణా సౌకర్యం.**
- **కాంట్రాక్టర్ మరియు బాధ్యులపై చట్టపరమైన కేసులు నమోదు**
- **జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**

**పుట్టపర్తి,ఆగస్టు,20:అనంత జనశక్తి న్యూస్**



ఆధునిక వెట్టిచాకిరీ విధానంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు శ్రీ సత్యసాయి జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ ఆదేశాల మేరకు అధికారులు వేగవంతంగా స్పందించి, అమానుషస్థితిలో సాగుతున్న బొగ్గు భట్టీల నరకం నుంచి మహారాష్ట్రకు చెందిన 40 మంది పేద కార్మికులను సురక్షితంగా కాపాడి వారికి స్వేచ్ఛాయుత జీవితాన్ని ప్రసాదించారు.అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని దగా
మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌కు చెందిన కాంట్రాక్టర్, చదువురాని అమాయకత్వాన్ని మరియు పేదరికాన్ని ఆసరాగా చేసుకుని రాయ్‌గఢ్ జిల్లాకు చెందిన 40 మంది కార్మికులను దారుణంగా మోసగించాడు. అప్పుల ఊబిలోకి దించి, శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని కొత్తచెరువు మండలం తలమర్ల మరియు గోరంట్ల ప్రాంతాల సమీపంలో సాగుతున్న బొగ్గు తయారీ లాంటి అత్యంత ప్రమాదకరమైన పనుల్లోకి వీరిని బలవంతంగా నెట్టాడు.చీకటి కొట్టులాంటి బతుకులు కనీస మానవ హక్కులు లేక, విద్యుత్ సౌకర్యం, శౌచాలయాలు కూడా లేని అపరిశుభ్ర వాతావరణంలో ఈ కుటుంబాలు అల్లాడిపోయాయి. తీవ్రమైన వేడి, ఊపిరాడని పొగ మధ్య రాత్రింబవళ్ళు శ్రమిస్తున్నప్పటికీ, వారి శ్రమను దోచుకుంటూ వారిని బాండెడ్ లేబర్‌గా మార్చేశారు.

జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ వేగవంతమైన చర్యలు...
బాండెడ్ లేబర్ వ్యవస్థపై విశ్వసనీయ సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ తక్షణమే స్పందించారు. రెవెన్యూ, పోలీస్, కార్మిక శాఖల ప్రత్యేక బృందాలతో తలమర్ల, గోరంట్ల పరిసర ప్రాంతాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించి బాధితులందరికీ విముక్తి కల్పించారు. 'వెట్టిచాకిరీ నిరోధక చట్టం' కింద బాధితులందరికీ విడుదల పత్రాలు పంపిణీ చేశారు. వారిపై కాంట్రాక్టర్ మోపిన అక్రమ రుణాలను పూర్తిగా రద్దు చేశారు.బాధితులకు తక్షణమే భోజన వసతి, వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రయాణ ఖర్చుల నిమిత్తం తగిన ఆర్థిక సహాయాన్ని అందించారు.
ప్రత్యేక వాహనాల ద్వారా 40 మంది కార్మికులను సురక్షితంగా వారి స్వరాష్ట్రమైన మహారాష్ట్ర (రాయ్‌గఢ్ జిల్లా)కు పంపించే ఏర్పాటు చేశారు.బాధితుల ఆనంద భాష్పాలు స్వగ్రామాలకు పయనమవుతున్న సమయంలో జిల్లా కలెక్టరేట్ వద్ద తీవ్ర భావోద్వేగ వాతావరణం నెలకొంది. "మా అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని కాంట్రాక్టర్ మమ్మల్ని దారుణంగా మోసం చేశాడు. ఎలాంటి సౌకర్యాలు లేని చీకటి ప్రపంచంలో మగ్గిపోతున్న మమ్మల్ని ఏపీ ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ గారు కాపాడి కొత్త జీవితాన్ని ఇచ్చారు" అని బాధితులు కన్నీటి పర్యంతమవుతూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ అక్రమ రవాణా మరియు వెట్టిచాకిరీకి కారణమైన మహారాష్ట్ర అహ్మద్‌నగర్ కాంట్రాక్టర్‌తో పాటు, స్థానికంగా సహకరించిన వ్యక్తులపై కఠినమైన చట్టపరమైన కేసులు నమోదు చేసినట్లు, చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదని అధికారులు స్పష్టం చేశారు.

# డీఎస్సీపై సీబీఐ విచారణకు సిద్ధమా?

**అమరావతి, ఆగస్ట్ 20, అనంతజనశక్తి న్యూస్**

ఉపాధ్యాయ నియామక ప్రక్రియపై ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తోంది. ఈ నియామకాల వ్యవహారంలో భారీ ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తోంది. ఇదే అంశంపై ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) విచారణకు సిద్ధంగా ఉన్నారా అని సవాల్ చేశారు.

**డీఎస్సీలో అక్రమాలు - వైఎస్ జగన్**

తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన జగన్... డీఎస్సీ నియామక ప్రక్రియలో అక్రమాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వం తన తప్పులను ఒప్పుకోవడానికి నిరాకరిస్తూ... ప్రశ్నించిన ప్రతిసారీ ఆత్మరక్షణలో పడుతోందని ధ్వజమెత్తారు.
శాసనసభలో ఈ అంశంపై చర్చించేందుకు ఉత్సాహం చూపిన కూటమి ప్రభుత్వం... అసలు నిజాలు బయటపడతాయనే భయంతో శాసనమండలిలో మాత్రం విస్తృత చర్చకు దూరంగా పారిపోతోందని జగన్ ఆరోపించారు. మండలిలో ప్రతిపక్ష సభ్యులు సంధించే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెనుకంజ వేస్తున్నారని చెప్పారు.
ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వైఖరిని జగన్ తీవ్రంగా తప్పుపట్టారు. డీఎస్సీ ప్రశ్నపత్రం తయారు చేయడం, అదే అధికారికి పరీక్ష నిర్వహణ బాధ్యతలను అప్పగించడంలో తప్పేమీ లేదనడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి వరకు ఏపీ డీఎస్సీ నియామకాల చరిత్రలోనే ఈ రెండు బాధ్యతలను ఒకే వ్యక్తికి అప్పగించిన దాఖలాలు లేవు. ప్రశ్నాపత్రం తయారు చేసేవారే పరీక్షను నిర్వహిస్తే, వ్యవస్థలోని చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ దెబ్బతింటాయి. అక్రమాలకు పునాది పడింది ఇక్కడే," అని జగన్ స్పష్టం చేశారు.

**ఆ పేరు ఎలా తొలగించారు..?**

డీఎస్సీ ప్రశ్నపత్రాల తయారీలో భాగస్వామిగా ఉన్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి నవీన్ వ్యవహారాన్ని జగన్ ప్రధానంగా ప్రస్తావించారు. తొలి మెరిట్ జాబితాలో నవీన్ మొదటి ర్యాంకు సాధించినట్లు స్వయంగా చంద్రబాబు, లోకేష్ శాసనసభలో అంగీకరించారని గుర్తుచేశారు. అలాంటప్పుడు ఆ తర్వాత అతని పేరును మెరిట్ జాబితా నుంచి ఎందుకు తొలగించారు..? రెండో మెరిట్ జాబితాను ఎందుకు విడుదల చేయాల్సి వచ్చిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "మొదటి మెరిట్ జాబితాలో ఫస్ట్ ర్యాంక్ వచ్చిన నవీన్‌కు కాల్ లెటర్ ఇవ్వకపోతే, అతడు సర్టిఫికేట్ల పరిశీలనకు ఎలా హాజరు కాగలిగాడు?" అని జగన్ ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారంలో అక్రమాలు జరిగాయని చెప్పడానికి ఇదే నిదర్శనమని అన్నారు. క్రీడా కోటా (స్పోర్ట్స్ కోటా) కింద జరిగిన నియామకాలు, జారీ చేసిన సర్టిఫికేట్లపై కూడా సమగ్ర విచారణ జరిపించాలని జగన్ డిమాండ్ చేశారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి అభ్యర్థుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశారనేందుకు సంబంధించిన ఆడియో రికార్డింగ్‌లు కూడా బయటకు వచ్చాయని ప్రస్తావించారు.
"ఏపీపీఎస్సీ గ్రూప్ 1 పై ప్రభుత్వం తప్పుడు ఆరోపణలు చేసింది.. డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలి.. తప్పు చేశారు అని క్లియర్ కట్‌గా ఉన్నా, సీబీఐ విచారణకు ఒప్పుకోవడం లేదు.. డీఎస్సీలో అక్రమాలపై పోరాడుతున్నాం.. మేం పోరాడుతున్న అంశాలు వాస్తవమే అని ప్రభుత్వం అంగీకరించింది.. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి, సీబీఐ ఎంక్వైరీ వేయాలి.. డీఎస్సీలో అక్రమాలపై ఆధారాలు ప్రజల ముందు ఉంచాం" అని వైఎస్ జగన్ తెలిపారు.
డీఎస్సీ నియామకాల్లో జరిగిన ఈ వ్యవహారమంతటిపై తక్షణమే సీబీఐ (CBI) విచారణ జరిపించాలని కోరారు. బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేస్తోందని వివరించారు. ఇప్పటికే ఈ అక్రమాలపై సమగ్ర విచారణ కోరుతూ ఆగస్టు 17న ఏపీ శాసనమండలి ప్రాంగణంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించిన విషయం తెలిసిందే.

# సీట్లు తగ్గొద్దు.. నిధులు తగ్గొద్దు..

(మొదటి పేజీ తరువాయి)



జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలకు డీలిమిటేషన్ కారణంగా రాజకీయంగా నష్టం జరగకూడదన్న అభిప్రాయం సమావేశంలో ప్రధానంగా వ్యక్తమైంది. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ 1971 జనాభా లెక్కలను ప్రాతిపదికగా కొనసాగించాలని కోరారు. ప్రస్తుత లోక్‌సభలోని 543 స్థానాలను యథాతథంగా కొనసాగిస్తూ, అదే స్థానాల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదించారు. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన రాష్ట్రాల పార్లమెంటరీ ప్రాతినిధ్యం తగ్గితే అన్యాయం జరుగుతుందని డీకే శివకుమార్ పేర్కొన్నారు. ఆర్థిక ప్రాధాన్యానికి తగ్గట్టుగానే రాజకీయ ప్రాతినిధ్యం ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. తమిళనాడు రాజకీయ నేత విజయ్ కూడా పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకుండా చట్టబద్ధమైన హామీ అవసరమని డిమాండ్ చేశారు.

**నిధుల పంపకంపై దక్షిణాది గళం**

ఆర్థిక సంఘం నిధుల పంపకంలో దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం చేయాలన్న డిమాండ్ కూడా సమావేశంలో ప్రధానంగా వినిపించింది. 15వ ఆర్థిక సంఘం సమయంలో కర్ణాటక వాటా 4.7 శాతం నుంచి 3.6 శాతానికి తగ్గిందని డీకే శివకుమార్ వెల్లడించారు. దీంతో ఆరేళ్లలో రాష్ట్రానికి సుమారు రూ.65 వేల కోట్ల నష్టం జరిగిందని ఆయన ఆరోపించారు. కర్ణాటకకు సిఫారసు చేసిన రూ.5,495 కోట్ల ప్రత్యేక గ్రాంటు విడుదల కాలేదని, మరో రూ.6 వేల కోట్ల రాష్ట్ర ప్రత్యేక గ్రాంటు కూడా అందలేదని డీకే పేర్కొన్నారు. 16వ ఆర్థిక సంఘంలో కర్ణాటక వాటా 4.131 శాతానికి పెరిగినప్పటికీ, తమ వాటాను తిరిగి 4.7 శాతానికి పెంచాలని రాష్ట్రం కోరుతోంది.

**కావేరిపై భిన్నస్వరాలు**

నీటి సమస్యలపై దక్షిణాది రాష్ట్రాల మధ్య భిన్న అభిప్రాయాలు కూడా సమావేశంలో స్పష్టమయ్యాయి. నీటి పంపకాల వివాదాల నుంచి నీటి సహకారం వైపు వెళ్లాల్సిన అవసరం ఉందని డీకే శివకుమార్ అన్నారు. సమానత్వం, పారదర్శకత, పరస్పర సహకారంతో నీటి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కావేరి, కృష్ణా, తుంగభద్ర, పెన్నా, పాలార్ వంటి నదులు దక్షిణాది ప్రజల జీవనాడులని పేర్కొన్న ఆయన.. కృష్ణా, అప్పర్ భద్ర, నదుల అనుసంధానం వంటి అంశాలపై కర్ణాటక తన వైఖరిని స్పష్టం చేస్తుందని తెలిపారు. మరోవైపు కావేరి జలాల విషయంలో సుప్రీంకోర్టు తీర్పులు, సంబంధిత అథారిటీల నిర్ణయాలను అమలు చేయాలని తమిళనాడు సీఎం విజయ్ డిమాండ్ చేశారు. ముల్లైపెరియార్ జలాశయం నీటిమట్టాన్ని 152 అడుగులకు పెంచే విషయంలోనూ కోర్టు తీర్పులకు కట్టుబడి ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

**చంద్రబాబు.. అభివృద్ధి, కనెక్టివిటీపై ఫోకస్**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం దక్షిణాది అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, నదుల అనుసంధానంపై ప్రధానంగా దృష్టి పెట్టారు. ఏపీ-కర్ణాటక-తమిళనాడు రాష్ట్రాలను అనుసంధానించే బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదనను ఆయన ముందుకు తెచ్చారు. కుప్పం మీదుగా అమరావతి-బెంగళూరు-చెన్నై రవాణా కారిడార్ అభివృద్ధి చేయాలని సూచించారు. దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రైపోర్టుల ఏర్పాటు, దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానం చేయడం వంటి ప్రతిపాదనలు చేశారు. రాష్ట్రాల యూనివర్సిటీలు, స్కిల్లింగ్ సంస్థలతో ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని, విపత్తుల సమయంలో పరస్పర సహకారం కోసం మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్‌ధామ్ వరకు ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి చేయాలని చంద్రబాబు ప్రతిపాదించారు. 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

**ఏపీ ప్రయోజనాలపైనా చంద్రబాబు ప్రత్యేక దృష్టి**

దక్షిణాది ఉమ్మడి అంశాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పెండింగ్ సమస్యలను కూడా చంద్రబాబు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10 సంస్థల విభజన సమస్యలను పరిష్కరించాలని కోరారు. 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విభజన సమస్యలపై కేంద్రం వేగంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం, సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి ప్రాజెక్టులకు కేంద్ర సహకారం అవసరమని పేర్కొన్నారు. దుగ్గరాజపట్నం పోర్టు, రిఫైనరీకి త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులకు కేంద్ర అనుమతులు ఇవ్వాలని, కడప జేఎస్‌డబ్ల్యూ రైల్వే లింక్‌కు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**గోదావరి–కావేరి అనుసంధానానికి ప్రతిపాదన**

దక్షిణాది జల సమస్యలకు పరిష్కారంగా నదుల అనుసంధానంపై చంద్రబాబు మరోసారి దృష్టి సారించారు. గోదావరి-కావేరి అనుసంధానం ద్వారా 500 టీఎంసీలకు పైగా నీటిని మళ్లించే ప్రతిపాదనను ప్రస్తావించారు. తమిళనాడు నీటి సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారంగా నదుల అనుసంధానాన్ని పరిశీలించాలని సూచించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు జలాల విషయంలో సమన్వయంతో ముందుకు వెళ్లాలని కోరారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని గంగా-కావేరి అనుసంధానానికి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక అవసరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

**కేంద్ర నిధులపై కేరళ అసంతృప్తి**

కేరళ కూడా కేంద్ర నిధుల పంపకం, తీర రక్షణ, ఆఫ్‌షోర్ మైనింగ్ అంశాలను సమావేశంలో ప్రస్తావించింది. ఆయుష్మాన్ భారత్ పథకం కింద రాష్ట్రం భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ కేంద్రం నుంచి తగినంత నిధులు రావడం లేదని కేరళ అసంతృప్తి వ్యక్తం చేసింది. రూ.1,493 కోట్లు ఖర్చు చేస్తే కేంద్రం కేవలం రూ.151 కోట్లు మాత్రమే ఇచ్చిందని ఆ రాష్ట్రం పేర్కొంది. కేరళ తీర ప్రాంతంలో 63 శాతం మేర కోతకు గురవుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. తీర రక్షణ కోసం NDRF, SDRF నిధులను వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరింది. శాస్త్రీయ అధ్యయనాలు, సరైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ లేకుండా ఆఫ్‌షోర్ మైనింగ్ బ్లాకుల వేలం నిర్వహించవద్దని డిమాండ్ చేసింది. మైనింగ్ వల్ల తీర ప్రాంత పర్యావరణానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించింది.

**దక్షిణాది రాష్ట్రాల సమిష్టి స్వరం**

డీలిమిటేషన్, ఆర్థిక సంఘం నిధులు, నీటి పంపకాలు, రాష్ట్రాల హక్కులు వంటి అంశాల్లో రాష్ట్రాల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ.. కేంద్రంతో సంబంధించి తమ ప్రయోజనాల విషయంలో దక్షిణాది రాష్ట్రాలు సమిష్టిగా గళం వినిపించాయి.
మరోవైపు డ్రగ్స్, అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణకు రియల్‌టైమ్ ఇంటెలిజెన్స్ షేరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న సూచన కూడా వచ్చింది. మొత్తంగా చెన్నైలో జరిగిన దక్షిణ మండలి సమావేశం కేవలం రాష్ట్రాల సమస్యల చర్చకే పరిమితం కాకుండా.. దక్షిణాది రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక హక్కులు,
అభివృద్ధి, నీటి వనరులు, కనెక్టివిటీ వంటి అంశాలపై భవిష్యత్‌లో సమిష్టి వ్యూహానికి వేదికగా మారే సంకేతాలను ఇచ్చింది


# కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ కన్నుమూత

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 20, అనంతజనశక్తి న్యూస్**

వేలాది మంది ప్రాణాలను బలిగొన్న 1984 నాటి ఘోర సిక్కు వ్యతిరేక హింసాకాండ కేసులో ప్రధాన దోషిగా జైలు శిక్ష అనుభవిస్తున్న కాంగ్రెస్ పార్టీ మాజీ పార్లమెంట్ సభ్యుడు సజ్జన్ కుమార్ గురువారం నాడు తుదిశ్వాస విడిచారు. 80 ఏళ్ల వయస్సు కలిగిన ఆయన, ఢిల్లీలోని ప్రసిద్ధ తీహార్ జైలులో జీవిత ఖైదీగా శిక్ష అనుభవిస్తున్న సమయంలో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. పరిస్థితి విషమించడంతో వెంటనే జైలు అధికారులు అత్యవసరంగా సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రికి చేరుకునే సమయానికే ఆయన మరణించినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించి అధికారికంగా ప్రకటించారు.

**సిక్కు అల్లర్ల కేసు ఏమైందంటే?**

మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ దారుణ హత్య అనంతరం 1984 నవంబర్ 1, 2 తేదీలలో దేశ రాజధానిలోని పాలం కాలనీ ప్రాంతంలో తీవ్ర స్థాయిలో హింసాత్మక ఘర్షణలు చెలరేగాయి. ఆ భయానక ఘటనల్లో ఐదుగురు నిర్దోషులు ప్రాణాలు కోల్పోవడానికి సజ్జన్ కుమార్ ప్రత్యక్షంగా కారణం అయ్యాడని ఆరోపణలు వచ్చాయి. ఈ అల్లర్ల వ్యవహారంపై సుదీర్ఘంగా జరిగిన విచారణ అనంతరం.. ఆయనను తీవ్ర నేరస్థుడిగా నిర్ధారిస్తూ ఢిల్లీ హైకోర్టు 2018 డిసెంబర్ 17న సంచలన తీర్పును ఇచ్చింది. ఈక్రమంలోనే జీవిత ఖైదు శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆనాటి నుంచి ఆయన తీహార్ జైలులోనే శిక్షను అనుభవిస్తున్నారు. హైకోర్టు విధించిన ఈ కఠినమైన శిక్షను సవాలు చేస్తూ ఆయన దేశ అత్యున్నత నాయస్థానమైన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్ ఇన్నాళ్లూ సుప్రీం కోర్టులో విచారణ దశలోనే పెండింగ్‌లో ఉండిపోయింది.
1984 నాటి సిక్కుల వ్యతిరేక అల్లర్లకు సంబంధించిన పలు చోట్ల నమోదైన అనేక కేసులలో సజ్జన్ కుమార్ పేరు ప్రధానంగా వినిపించింది. రాజధాని పరిధిలోని జానక్‌పురి, వికాస్‌పురి ప్రాంతాల్లో అల్లర్లను తీవ్రంగా రెచ్చగొట్టారనే తీవ్రమైన ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. అయితే ఈ కేసులను విచారించిన ఢిల్లీలోని స్థానిక కోర్టు ఈ సంవత్సరం జనవరి నెలలో కీలక నిర్ణయం తీసుకుంది. ఆ రెండు కేసుల్లో ఆయనపై సరైన ఆధారాలు లేవనే కారణంతో నిర్దోషిగా ప్రకటిస్తూ కేసుల నుంచి ముందస్తుగా విముక్తి కల్పించింది. అయినప్పటికీ.. పాలం కాలనీ జీవిత ఖైదు శిక్ష కొనసాగుతుండటంతో ఆయన జైలులోనే ఉండాల్సి వచ్చింది.



చివరికి ఈ చట్టపరమైన ప్రక్రియ ముగియక ముందే.. జైలులోనే ఆయన ప్రాణాలు కోల్పోవడంతో ఒక చారిత్రాత్మక అధ్యాయం ముగిసినట్లయింది.

# విద్యుత్ సమస్యల పరిష్కారానికి సీజీఆర్ఎఫ్ సమావేశం

**గుండాల, ఆగస్టు 20, అనంత జనశక్తి న్యూస్**

ఇల్లందు, గుండాల, ఆళ్లపల్లి మండలాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సీజీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 21న వినియోగదారుల సమస్యల పరిష్కార సమావేశం నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ జి. నాగప్రసాద్ తెలిపారు. ఇల్లందులోని 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ఇల్లందు టౌన్, ఇల్లందు రూరల్, గుండాల సెక్షన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు, ముఖ్యంగా రైతులు తమ విద్యుత్ కనెక్షన్లు, సేవలకు సంబంధించిన సమస్యలు, ఫిర్యాదులను నేరుగా ఫోరం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందవచ్చని తెలిపారు. గ్రామాల్లోని సామూహిక విద్యుత్ సమస్యలను కూడా సమావేశంలో తెలియజేయవచ్చన్నారు. సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు కార్యక్రమాన్ని గ్రామ ప్రజలకు విస్తృతంగా తెలియజేసి, సమస్యలు ఉన్న వినియోగదారులు సమావేశానికి హాజరయ్యేలా సహకరించాలని నాగప్రసాద్ కోరారు.

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించే వరకు దీక్ష విరమించం



**- దీక్షకు సంఘీభావం తెలిపిన ఏకలవ్య పాఠశాల విద్యార్థులు**

**గుండాల, ఆగస్టు 20, అనంత జనశక్తి:**

నిబంధనలకు విరుద్ధంగా ఏకలవ్య పాఠశాలలో తీజ్ పండుగ నిర్వహించిన ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని విధుల నుంచి తొలగించే వరకు దీక్ష విరమించబోమని 9 తెగల సంఘాల జేఏసీ చైర్మన్ చుంచు రామకృష్ణ స్పష్టం చేశారు. మండలంలోని ముత్తాపురం ఏకలవ్య పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఒక వర్గానికి చెందిన తీజ్ పండుగను నిర్వహించడాన్ని నిరసిస్తూ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో రెండు రోజులుగా పాఠశాల ఎదుట దీక్ష కొనసాగుతోంది. గురువారం పాఠశాల విద్యార్థులు విరామ సమయంలో బయటకు వచ్చి దీక్ష చేస్తున్న నాయకులకు పూలమాలలు వేసి సంఘీభావం తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా తీజ్ పండుగ నిర్వహించడంతో ఇతర విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారని ఆదివాసీ సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ విషయంపై స్పందించిన ఆర్‌సీవో అరుణకుమారి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులను విచారించి సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.పాఠశాల గేట్‌కీపర్‌ను విధుల నుంచి తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ దీక్ష చేస్తున్న నాయకులకు విద్యార్థులు సంఘీభావం తెలిపే సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు వారిని తిరిగి పాఠశాలలోకి పంపించారు. ఈ ఘటనపై ఆర్‌సీవో విచారణ నివేదికను జిల్లా కలెక్టర్, పీఓ, సెక్రటరీలకు సమర్పించినట్లు సమాచారం. అయినా తమ డిమాండ్లపై స్పష్టమైన హామీ వచ్చే వరకు దీక్ష కొనసాగిస్తామని చుంచు రామకృష్ణ తెలిపారు. ఏకలవ్య పాఠశాలలో జరుగుతున్న వివక్ష, విద్యార్థుల సమస్యలు, తీజ్ వేడుకల నిర్వహణపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యకు పరిష్కారం చూపే వరకు అక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. నేటి నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు కోడెం వెంకటేశ్వర్లు, సనప విష్ణు, మోకాళ్ల వీరస్వామి, మహేందర్, నాగరాజు, శ్రీను, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కారంలో 30 శాతం చెక్కపొడి.. కల్తీ మసాలా తయారీ కేంద్రంపై పోలీసుల దాడులు



**హైదరాబాద్:ఆగస్టు 20, అనంత జనశక్తి న్యూస్**

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో కల్తీ మసాలా తయారీ కేంద్రంపై ఎస్‌వోటీ పోలీసులు, ఆహార కల్తీ పర్యవేక్షణ బృందాలు సంయుక్తంగా దాడులు చేశాయి. మేడిపల్లి శ్రీనివాస్‌నగర్ కాలనీలోని సాయి తిరుమల ఎంటర్‌ప్రైజెస్‌పై పోలీసులు దాడి చేసి తనిఖీలు చేపట్టారు. అపరిశుభ్ర వాతావరణంలో పసుపు, కారం, ధనియాల పొడి, గరం మసాలా తయారీ చేస్తున్నట్లు గుర్తించారు. కారం పొడిలో ఏకంగా 30 శాతం చెక్క పొడి కలిపినట్లు.. స్వదేశీ స్వస్తిక్ బ్రాండ్ పేరుతో డూప్లికేట్ ప్యాకింగ్, లేబులింగ్ చేసినట్లు నిర్ధరించారు. ఒరిజినల్ బ్రాండ్‌ను పోలిన ప్యాకెట్లలో కల్తీ కారం పొడి విక్రయానికి సిద్ధం చేసినట్లు గుర్తించారు. వీటిని వివిధ వాణిజ్య సంస్థలు, వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు తేల్చారు. మొత్తం 10,890 కిలోల కల్తీ ఆహార పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.25లక్షలు ఉంటుందని అంచనా. ఈ ఘటనలో నిర్వాహకులు సత్యనారాయణ, రుద్రశేఖర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి.. రూ.30 వేలు లంచం డిమాండ్

**కామారెడ్డి:ఆగస్టు 20, అనంత జనశక్తి న్యూస్**

కామారెడ్డి జిల్లా రాజంపేట పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న దువ్వల ఆంజనేయులు రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. నిజామాబాద్ ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో అధికారుల బృందం కామారెడ్డి పట్టణం ఎన్జీవోస్ కాలనీలోని దువ్వల ఆంజనేయులు ఇంట్లో గురువారం దాడులు నిర్వహించింది. ఫిర్యాదుదారుడి కుమారుడికి ఓ కేసు విషయంలో స్టేషన్ బెయిల్ ఇప్పించేందుకు, ఛార్జిషీట్‌లో శిక్ష తక్కువపడే సెక్షన్లు జోడించేందుకు ఎస్సై రూ.30 వేలు లంచం డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని బాధితుడు ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. పథకం ప్రకారం బాధితుడు ఎస్సైకి నగదు అందిస్తుండగా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎస్సైని అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపరచనున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఫిర్యాదుదారుడి వివరాలు గోప్యంగా ఉంటాయని, ఈ కేసు దర్యాప్తులో ఉందన్నారు.

# ఎంహెచ్ఏ పోర్టల్స్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ప్రథమ స్థానం



**- సైబర్ క్రైమ్ అధికారులు, సిబ్బందిని అభినందించిన ఎస్పీ రోహిత్ రాజు**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 20, అనంత జనశక్తి న్యూస్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఎంఆర్ఎమ్, జిఆర్ఎమ్, సమన్వయ, సహాయోగ్ వంటి ఆధునిక పోర్టల్స్‌ను సమర్థవంతంగా వినియోగిస్తూ ఉత్తమ పనితీరు కనబరిచిన తెలంగాణ పోలీస్ యూనిట్లలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందింది. ఎంహెచ్ఏ పోర్టల్స్‌లో నమోదైన పనితీరు ఆధారంగా ప్రకటించిన ఉత్తమ ప్రదర్శన జాబితాలో సమన్వయ కేటగిరీలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొదటి స్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఉత్తమ ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైమ్ అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. సైబర్ నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ బాధితులకు వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. యువతలో సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించేందుకు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో స్పార్క్ క్లబ్ ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రియదర్శిని డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే మోసాలు, డిజిటల్ అరెస్టులు తదితర సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ మోసాలపై అవగాహన కల్పించడంలో చురుకుగా పాల్గొంటున్న విద్యార్థులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సైబర్ నేరాల నియంత్రణలో పోలీసుల చర్యలతో పాటు ముఖ్యంగా యువతలో అవగాహన ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు సైబర్ అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎంహెచ్ఏ పోర్టల్స్‌లో జిల్లాకు లభించిన ఈ గుర్తింపు పోలీసు అధికారులు, సైబర్ క్రైమ్ సిబ్బంది సమిష్టి కృషికి నిదర్శనమని ఎస్పీ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో సైబర్ నేరాల నియంత్రణకు మరింత సమర్థవంతంగా పనిచేయాలని అధికారులను, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెల్ సీఐ జితేందర్, ఎస్సై జుబేదా బేగం, సైబర్ సెల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏడాదిగా పనిచేయని వైద్య పరికరంపై కలెక్టర్ ఆగ్రహం



**- గండుగులపల్లిని మోడల్ సోలార్ గ్రామంగా తీర్చిదిద్దాలి**
**- గురుకులంలో పరిశుభ్రత, మెనూ అమలుపై నిర్లక్ష్యం.. ప్రిన్సిపాల్, వార్డెన్‌కు షోకాజ్**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 20, అనంత జనశక్తి న్యూస్**

దమ్మపేట మండలంలో అభివృద్ధి పనులు, వైద్య సేవలు, విద్యార్థుల సౌకర్యాలను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్వారిగూడెం పీహెచ్‌సీ, గండుగులపల్లి మోడల్ సోలార్ గ్రామం, మదలపల్లి గురుకుల పాఠశాల, కళాశాలను పరిశీలించారు.

పట్వారిగూడెం పీహెచ్‌సీలో సుమారు రూ.3 లక్షల విలువైన అనాలసిస్ యంత్రం ఏడాదిగా పనిచేయక పోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనిచేయని వైద్య పరికరాలను వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

గండుగులపల్లిలో 424 మంది లబ్ధిదారులకు సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయనుండగా, ఇప్పటివరకు 242 ఇళ్లలో పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. మిగిలిన ఇళ్లలో పనులను వేగవంతం చేసి గ్రామాన్ని ఆదర్శ మోడల్ సోలార్ గ్రామంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ సూచించారు. మదలపల్లి గురుకుల పాఠశాలలో డిజిటల్ తరగతి గది, డైనింగ్ హాల్‌లో అపరిశుభ్రత, మెనూ అమలులో లోపాలను కలెక్టర్ గుర్తించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంలో నిర్లక్ష్యం వహించినందుకు ప్రిన్సిపాల్, వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం, భద్రత విషయంలో రాజీ పడవద్దని స్పష్టం చేశారు.

# సత్తా చాటిన భద్రాద్రి పోలీసులు





**- సమన్వయ కేటగిరీలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం**
**- ఎస్పీ రోహిత్ రాజు నాయకత్వంలో సైబర్ భద్రతకు పెద్దపీట**
**- సైబర్ సెల్ సీఐ జితేందర్ కృషికి ప్రశంసలు**
**- సాంకేతికతను అస్త్రంగా మార్చుకున్న పోలీస్ యంత్రాంగం**
**- స్పార్క్ క్లబ్‌తో విద్యార్థుల్లో సైబర్ అవగాహన**
**- అవార్డు వెనుక అధికారుల సమిష్టి కృషి**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్టు 20, అనంత జనశక్తి న్యూస్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ శాఖ మరోసారి తన ప్రతిభను చాటుకుంది. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఎంహెచ్ఏ పోర్టల్స్‌లో నమోదైన పనితీరు ఆధారంగా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది. సమన్వయ కేటగిరీలో జిల్లా పోలీస్ శాఖ రాష్ట్రంలోనే ప్రథమ స్థానాన్ని సాధించడం విశేషం. ఈ ఘనత జిల్లా పోలీస్ యంత్రాంగం పనితీరుకు అద్దం పడుతోంది. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు వేగవంతమైన సేవలందించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎంఆర్ఎమ్, జిఆర్ఎమ్, సమన్వయ, సహాయోగ్ వంటి ఆధునిక పోర్టల్స్ వినియోగంపై అధికారులు, సిబ్బందిని సమన్వయం చేశారు. దీంతో జిల్లా సైబర్ క్రైమ్ విభాగం పనితీరులో గణనీయమైన పురోగతి సాధించింది. ఈ విజయానికి సైబర్ సెల్ సీఐ జితేందర్ కృషి కూడా కీలకంగా నిలిచింది. సైబర్ నేరాల కేసుల పరిష్కారంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సిబ్బందికి మార్గనిర్దేశం చేస్తున్నారు. బాధితుల ఫిర్యాదులను వేగంగా స్వీకరించి, సంబంధిత విభాగాలతో సమన్వయం చేస్తూ పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలోనూ సైబర్ సెల్ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. సైబర్ నేరాలను కేవలం కేసుల నమోదు, దర్యాప్తుకే పరిమితం చేయకుండా నివారణకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇందులో భాగంగా యువతను సైబర్ భద్రతపై చైతన్యపరిచేందుకు స్పార్క్ క్లబ్‌ను వినియోగిస్తున్నారు. ప్రియదర్శిని డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, సామాజిక మాధ్యమాల మోసాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ అరెస్టుల పేరుతో జరుగుతున్న మోసాలపై కూడా విద్యార్థులను అప్రమత్తం చేశారు. విద్యార్థులు పొందిన అవగాహనను తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా చేరవేయాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పోలీస్ అధికారులు చెబుతున్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేక పర్యవేక్షణతో సైబర్ విభాగం మరింత సమర్థవంతంగా పనిచేస్తోంది. ఎంహెచ్ఏ పోర్టల్స్‌లో సాధించిన ప్రథమ స్థానం ఈ సమిష్టి కృషికి నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైమ్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సైబర్ నేరాల నియంత్రణలో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ఆదేశించారు. జిల్లా పోలీస్ శాఖకు రాష్ట్ర స్థాయిలో వచ్చిన ఈ గుర్తింపు పోలీసు వర్గాల్లో ఉత్సాహాన్ని నింపింది. సైబర్ నేరాలపై అప్రమత్తతే ప్రధాన రక్షణ మార్గమని అధికారులు సూచిస్తున్నారు. ప్రజలు అపరిచిత లింకులు, అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలకు స్పందించకుండా జాగ్రత్త వహించాలని కోరుతున్నారు. బ్యాంకు వివరాలు, ఓటీపీ, వ్యక్తిగత సమాచారం ఎవరితోనూ పంచుకోవద్దని సూచిస్తున్నారు. సైబర్ నేరాల బారిన పడిన వెంటనే ఆలస్యం చేయకుండా పోలీసులను సంప్రదించాలని అధికారులు చెబుతున్నారు. ఎస్పీ రోహిత్ రాజు నాయకత్వం, సైబర్ సెల్ సీఐ జితేందర్ కృషి, సిబ్బంది సమిష్టి పనితీరుతో ఈ విజయాన్ని సాధించడం అభినందనీయం. భవిష్యత్తులోనూ సైబర్ నేరాల నియంత్రణలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మరింత ముందంజలో నిలవాలనే లక్ష్యంతో పోలీస్ శాఖ పనిచేస్తోంది.



# రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగించాలి



**గుండాల, ఆగస్టు 20, అనంత జనశక్తి న్యూస్ :**

**గుండాల మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఊకె బుచ్చయ్య ఆధ్వర్యంలో స్వర్గీయ భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎస్‌కే ఖదీర్ హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌కే ఖదీర్ మాట్లాడుతూ.. గాంధీ కుటుంబం దేశానికి ఎంతో స్ఫూర్తిదాయకమని, దేశం కోసం ఆ కుటుంబం చేసిన త్యాగాలు మరువలేనివని అన్నారు. భారతదేశాన్ని ఆధునిక సాంకేతిక రంగం వైపు తీసుకెళ్లడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. కంప్యూటర్, సమాచార సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. అలాగే స్థానిక సంస్థల్లో మహిళలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించడంతో పాటు, యువత రాజకీయాల్లో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ఓటు హక్కు వయోపరిమితిని 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని తెలిపారు. రాజీవ్ గాంధీ ఆశయాల సాధన కోసం దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు ఎస్‌కే అబ్దుల్ నభీ, వాంకుడోత్ రమేష్, ఎస్‌కే కాసీం, ఎస్‌కే వాజీద్ పాషా, నూనావత్ రవి, సనప రాంబాబు, పల్లపు రాజేష్, బొంగు చంద్రశేఖర్, బానోత్ నరేందర్, గడ్డం రాజేష్, జాటోత్ వీరన్న, సోషల్ మీడియా నాయకుడు మండలోజు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.**



# హైబీపీ ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ ఒక్క అలవాటు చాలా ముఖ్యం: వైద్యులు చెబుతున్న ముఖ్యమైన విషయం

ప్రస్తుత ఆధునిక జీవనశైలిలో చాలామందిని వేధిస్తున్న సమస్యలలో రక్తపోటు (బీపీ) ఒకటి. ఈ సమస్యను అదుపులో ఉంచడానికి చాలామంది ఆహారం, వ్యాయామంపై మాత్రమే దృష్టి పెడతారు. కానీ, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సంజయ్ భోజ్‌రాజ్ చెప్పిన ఒక కీలకమైన విషయం అందరినీ ఆలోచింపచేస్తోంది. బీపీ నియంత్రణకు ఆహారం, వ్యాయామంతో పాటు, ఒక అలవాటు కూడా అంతే ముఖ్యమని ఆయన చెబుతున్నారు. ఏంటది?



**బీపీ నియంత్రణలో నిద్ర కీలక పాత్ర**

బీపీ అదుపులో ఉండాలంటే నిద్రలో క్రమబద్ధత చాలా ముఖ్యం అని డాక్టర్ సంజయ్ భోజ్‌రాజ్ తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో చెప్పారు. క్రమం తప్పకుండా నిద్రపోవడం కష్టమైన పని అయినా, దాని వల్ల కలిగే ప్రయోజనాలు అపారమని ఆయన అన్నారు. 'బీపీ ఎక్కువగా ఉన్న ప్రతి ఒక్కరికీ నేను సిఫార్సు చేసే ఒకే ఒక్క ముఖ్యమైన అలవాటు ఇది' అని ఆయన స్పష్టం చేశారు. చాలామందికి బీపీ నియంత్రణ అంటే కేవలం ఆహారం, వ్యాయామం అని మాత్రమే తెలుసు. కానీ, మీ నిద్ర షెడ్యూల్ కూడా అంతే ముఖ్యమని ఆయన వివరించారు.

**'ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోండి, ఒకే సమయానికి లేవండి'**

'నేను సిఫార్సు చేసే నెం.1 అలవాటు ఇదే. ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడానికి, ఒకే సమయానికి నిద్ర లేవడానికి ప్రయత్నించండి. సెలవు రోజుల్లో కూడా ఈ నియమాన్ని








పాటించండి. ఇది కష్టమని నాకు తెలుసు. కానీ ఎందుకు ఇది ముఖ్యం అంటే...' అని వివరిస్తూ దాని ప్రయోజనాలను ఇలా చెప్పారు.

సర్కాడియన్ రిథమ్‌ను క్రమబద్ధీకరిస్తుంది: ఇది మన శరీర గడియారాన్ని క్రమబద్ధీకరించి, ఎప్పుడు విశ్రాంతి తీసుకోవాలో, ఎప్పుడు మేల్కొలపాలో చెబుతుంది. కార్టిసాల్ స్థాయిలను తగ్గిస్తుంది: రాత్రిపూట మన ఒత్తిడి హార్మోన్ అయిన కార్టిసాల్ స్థాయిలను తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యానికి సహాయపడుతుంది: హార్ట్ రేట్ వేరియబిలిటీ ని మెరుగుపరుస్తుంది. రక్తపోటు నియంత్రణకు: ఇది బీపీని నియంత్రించడంలో సహాయపడుతుంది. 'నిద్ర అనేది ఎక్కువ సమయం ఉండటం కాదు, స్థిరంగా ఉండటమే ఇక్కడ ముఖ్యం' అని ఆయన అన్నారు. ఆ క్రమబద్ధత మీ శరీరానికి ఎప్పుడు విశ్రాంతి తీసుకోవాలో, ఎప్పుడు మరమ్మత్తు చేసుకోవాలో, అలాగే రక్తపోటును ఎలా నియంత్రించాలో చెబుతుందని డాక్టర్ భోజ్‌రాజ్ తెలిపారు.

# టీనేజ్ అమ్మాయిల్లో కనిపించే పీసీఓఎస్ లక్షణాలు... తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేసే 5 ప్రధాన సంకేతాలు



పోలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ అనేది యువతులలో, ముఖ్యంగా టీనేజ్ అమ్మాయిలలో కనిపించే ఒక సాధారణ హార్మోన్ల సమస్య. ఈ సమస్యకు సంబంధించిన లక్షణాలను చాలామంది తల్లిదండ్రులు యుక్తవయసులో వచ్చే సాధారణ మార్పులుగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారు. ఈ నిర్లక్ష్యం వల్ల చికిత్స ఆలస్యమై, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



**1. మొదటి కొన్ని సంవత్సరాల తర్వాత కూడా క్రమరహిత పీరియడ్స్**

అమ్మాయిలకు రుతుస్రావం మొదలైన మొదటి ఒకటి లేదా రెండు సంవత్సరాలలో పీరియడ్స్ క్రమరహితంగా ఉండటం సాధారణం. కానీ, ఈ సమయం దాటిన తర్వాత కూడా పీరియడ్స్ చాలా అరుదుగా, ఆలస్యంగా లేదా అస్సలు రాకపోతే అది PCOS లక్షణం కావచ్చు. చాలామంది తల్లిదండ్రులు ఇది ఒత్తిడి లేదా ఆహారపు అలవాట్ల వల్ల జరుగుతుందని భావించి, సరైన సమయంలో వైద్య సహాయం తీసుకోవడం ఆలస్యం చేస్తుంటారు.

**2. సాధారణ చికిత్సకు స్పందించని మొండి మొటిమలు**

టీనేజ్ వయసులో మొటిమలు రావడం సహజమే. కానీ, ముఖం, గడ్డం, ఛాతీ లేదా వీపుపై మొటిమలు వచ్చి, ఎన్ని క్రీములు వాడినా తగ్గకపోతే అది PCOS లక్షణం కావచ్చు. సాధారణ మొటిమలకు భిన్నంగా, PCOS వల్ల వచ్చే మొటిమలు చాలా మొండిగా, బాధాకరంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఆండ్రోజెన్ (పురుష హార్మోన్) స్థాయిలు పెరగడాన్ని సూచిస్తాయి.

**3. శరీరంలో అధిక రోమాలు లేదా జుట్టు రాలడం**

గడ్డం, పై పెదవి, ఛాతీ లేదా పొట్టపై అవాంఛిత రోమాలు పెరగడం హార్మోన్ల అసమతుల్యతకు స్పష్టమైన సంకేతం. అయినప్పటికీ, చాలామంది దీన్ని ఒక






సాధారణ సౌందర్య సమస్యగా భావించి పట్టించుకోరు. దీనికి విరుద్ధంగా, పురుషులలో కనిపించే పద్ధతిలో జుట్టు పలచబడటం లేదా అధికంగా రాలిపోవడం కూడా టీనేజ్ అమ్మాయిల్లో కు సంకేతం కావచ్చు. అమ్మాయిలకు రుతుస్రావం మొదలైన మొదటి ఒకటి లేదా రెండు సంవత్సరాలలో పీరియడ్స్ క్రమరహితంగా ఉండటం సాధారణం. కానీ, ఈ సమయం దాటిన తర్వాత కూడా పీరియడ్స్ చాలా అరుదుగా, ఆలస్యంగా లేదా అస్సలు రాకపోతే అది లక్షణం కావచ్చు.

**4. త్వరగా బరువు పెరగడం లేదా బరువు తగ్గడం కష్టం కావడం**

PCOS ఉన్న చాలామంది అమ్మాయిలు సాధారణ ఆహారం తీసుకుని, వ్యాయామం చేసినా బరువు పెరగడం లేదా బరువు తగ్గడానికి చాలా ఇబ్బంది పడతారు. ఇది ఇన్సులిన్ రెసిస్టెన్స్ అనే కీలకమైన సమస్య వల్ల వస్తుంది. దీనిని చాలామంది తల్లిదండ్రులు కేవలం జీవనశైలి మార్పులుగా భావించి, దాని వెనుక ఉన్న హార్మోన్ల సమస్యను గుర్తించడంలో విఫలమవుతారు.

**5. మూడ్ స్వింగ్స్, ఆత్మవిశ్వాసం తగ్గడం**

మొటిమలు లేదా అవాంఛిత రోమాల వంటి కనిపించే లక్షణాల వల్ల PCOS ఉన్న టీనేజ్ అమ్మాయిలు తరచుగా మూడ్ స్వింగ్స్, ఆందోళన లేదా ఆత్మవిశ్వాసం తగ్గడం వంటి భావోద్వేగ సమస్యలను ఎదుర్కొంటారు. ఈ సమస్యలు శారీరక లక్షణాల వలెనే తీవ్రంగా ఉంటాయి. అయినప్పటికీ, వీటిని PCOSగా భావించరు. వైద్యులకు చూపించరు. వైద్యులను సంప్రదించడం వల్ల తగిన చికిత్స పొందే అవకాశం ఉంటుంది.



# అనుపమకు హ్యాట్సాఫ్ చెప్పాలి: శంకర్ కుమార్తె అదితి ప్రశంసలు





అనుపమ పరమేశ్వరన్ ఇటీవల తన వ్యక్తిగత జీవితం, మాజీ ప్రియుడి వల్ల ఎదుర్కొన్న మానసిక క్షోభను బయటపెట్టిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. ఈ విషయంపై తాజాగా నటి అదితి శంకర్ స్పందించారు. అనుపమ ధైర్యాన్ని, నిజాయతీని ఆమె ప్రశంసించారు. అదితి నటించిన 'వన్స్‌మోర్' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ అంశంపై మాట్లాడారు. "అనుపమ ఇంటర్వ్యూ చూశాను. ఆమె కామెంట్స్‌పై ఒక్కొక్కరికి ఒక్కో అభిప్రాయం ఉండొచ్చు. కానీ, ఆమె ఎదుర్కొన్న ఇబ్బందిని ధైర్యంగా పంచుకున్నందుకు హ్యాట్సాఫ్ చెప్పాలి. ఆమె మాటల్లో నిజాయతీ ఉంది" అని అదితి పేర్కొన్నారు. ఎవరినీ నిందించడం, కించపరచడం అనుపమ ఉద్దేశం కాదని అదితి అభిప్రాయపడ్డారు. ఆమె పంచుకున్న అనుభవం అవగాహన కలిగించేలా ఉందన్నారు.

చాలామంది పురుషులు, మహిళలు తీవ్రమైన మానసిక ఘర్షణలతో కూడిన బంధాల్లో ఉంటున్నారని.. తాము ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నామో కూడా అర్థం చేసుకోలేకపోతున్నారని అదితి వివరించారు. అనుపమలా ఓపెన్‌గా మాట్లాడటం వల్ల అలాంటి వారికి కూడా ఒక స్పష్టత వస్తుందని తెలిపారు. మాజీ బాయ్‌ఫ్రెండ్ పేరును ప్రస్తావించకుండా అనుపమ తన వ్యక్తిగత జీవితంపై ఇటీవల మాట్లాడారు. అతడి ప్రవర్తన వల్ల ఒక నటిగా, మహిళగా తనను తాను నిందించుకునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్ల పాటు ఆ బంధంలో నరకం చూశానని చెప్పారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ వైరల్ అవుతుండగా అభిమానులు ఆమెకు ధైర్యం చెబుతూ పోస్ట్‌లు పెడుతున్నారు.

# మరో ప్రేమకథతో మమిత సిద్ధం



"ఇప్పుడెందుకు చంద్రముఖిలో జ్యోతికలా బిహేవ్ చేస్తున్నావు" అంటూ 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంతో ఇటీవలే తెరపై సందడి చేసి కుర్రకారుని ఆకట్టుకుంది అందాల తార మమితా బైజు. ఇప్పుడీ జోష్‌లోనే మరో ప్రేమకథతో ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీగా ఉంది. ఆమె, నివిన్ పాలీ జంటగా నటించిన చిత్రం 'బెత్లెహెం కుడుంబ యూనిట్'. 'ప్రేమలు' ఫేమ్ గిరీశ్ ఏడీ తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు సినీప్రియుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో భాగంగానే తాజాగా మరో పోస్టర్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది మమిత. అందులో ఆమె కూర్చొని చిరునవ్వులు చిందిస్తూ ఆకట్టుకుంటుంది. ఫహాద్ ఫాజిల్, దిలీష్ పోతాన్ నిర్మించిన ఈ రొమాంటిక్ ప్రేమకథా చిత్రం ఈ నెల 21న థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది.

# సూర్య పడిన కష్టాలన్నీ నాకు తెలుసు: రాధిక

తాజాగా 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో విజయాన్ని అందుకున్నారు నటుడు సూర్య. ఈ సినిమా సక్సెస్ మీట్‌లో నటి రాధిక మాట్లాడుతూ సూర్యపై ప్రశంసలు కురిపించారు. ఆయన ఎన్నో మానసిక పోరాటాలు చేశారని.. వాటిని అధిగమించడం తాను దగ్గరనుంచి చూశానని చెప్పారు.

విశ్వనాథ్ అండ్ సన్స్‌లో సూర్యకు తల్లి పాత్ర పోషించిన రాధిక.. ఈ చిత్రాన్ని ఆయన అంగీకరించారని తెలిసి ఆశ్చర్యపోయినట్లు చెప్పారు. "సూర్య పడిన కష్టాలను, బాధను నేను దగ్గర నుంచి చూశాను. అతడిని నా కుటుంబంలో ఓ భాగంగా భావిస్తాను. సినిమాల్లో చాలా మంది సవాళ్లను ఎదుర్కొన్నారు. కానీ, నిజమైన మానసిక పోరాటాలు మరో స్థాయిలో ఉంటాయి. సూర్య ఆ కష్టాలను అధిగమించాడు. ఇప్పుడు అతడిని చూస్తుంటే గర్వంగా అనిపిస్తుంది. సూర్య ఎక్కువగా మాట్లాడే వ్యక్తి కాదు. తన మనసులోని భావాలను చాలా అరుదుగా కొంతమందితో మాత్రమే పంచుకుంటాడు. అతడు ఎక్కువగా మాట్లాడే ఆ కొంతమందిలో సన్నిహితుల్లో నేను కూడా ఒకదాన్ని. అతడికి అప్పుడప్పుడు సలహాలు ఇస్తుంటా" అని రాధిక చెప్పారు.

ఇటీవల ఓ ఈవెంట్‌లో రాధికతో ఉన్న అనుబంధం గురించి సూర్య కూడా మాట్లాడారు. కార్తి చదువుకోవడానికి అమెరికా వెళ్లేందుకు రాధిక ఆర్థిక సాయం చేశారని తెలిపారు. ఆమె చేసిన సాయాన్ని కుటుంబమంతా జీవితాంతం గుర్తు పెట్టుకుంటామన్నారు. ఇక వెంకీ అట్లూరి దర్శకత్వంలో వచ్చిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' వసూళ్లతో దూసుకుపోతోంది. ఐదు రోజుల్లోనే ఈ సినిమా రూ.150కోట్లు వసూళ్లు చేసింది.

# అవమానాలు భరిస్తే... మసకబారే ఆ వెలుగు!



"చిత్రపరిశ్రమలో నటిగా రాణించే క్రమంలో ఆత్మ విశ్వాసం పెరిగినప్పటికీ.. చిన్నతనంలోని కొన్ని అభద్రతా భావాలు ఇప్పటికీ నాలో అలానే ఉండి పో యాయ"ని అంటోంది హిందీ కథానాయిక కృతి సనన్. ఇటీవల ఓ ఇంటర్వ్యూ లో పాల్గొన్న కృతి బాల్యంలో తోటి విద్యార్థుల వేధింపులు, అంచనాల మధ్య ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయిన పరిస్థితుల గురించి ఆసక్తిర సంగతుల్ని పంచుకుంది. "నిజానికి చిన్నప్పుడు నేను చాలా వేధింపులకు గురయ్యాను. అవి నన్నెంతగా ప్రభావితం చేశాయంటే.. నా కోసం నేను నిలబడలేకపోయిన ప్రతిసారి ఆ పరిస్థితులు నాకు ఆ బాల్యాన్ని గుర్తు చేస్తాయి. అందుకే నేను ఎప్పుడూ నాకోసం నేను నిలబడాలని అనుకుం టాను. లేకపోతే అప్పటిలానే మళ్లీ కుంగిపోతా ను. ఇతరులు మిమ్మల్ని గౌరవించకపోవడం, తక్కువగా అంచనా వేయడాన్ని అనుమతిస్తే ఎక్కడో ఒక చోట మిమ్మల్ని మీరు గౌరవించు కోవడం లేదని అర్థం. మనందరికీ ఆత్మ విశ్వా సం ఉంటుంది. కానీ, ఇతరులు గౌరవించక పోయి నా.. అవమానాలను భరిస్తూ ఉంటే మనలోని ఆత్మ విశ్వాసమనే వెలుగు క్రమంగా మసకబారిపో వడం మొదలవుతుం ద"ని అం ది. అల్లీ పాత్రలో ఈ మధ్యే 'కాక్‌టెయిల్ 2' సినిమాలో కనిపించి ప్రేక్షకుల్ని అలరించింది కృతి.

# ప్రపంచ బ్యాడ్మింటన్.. లక్ష్యకు షాక్







సొంతగడ్డపై జరుగుతున్న ప్రతిష్ఠాత్మక టోర్నీ ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు పతకం అందించే సత్తా ఉన్న క్రీడాకారుల్లో ఒకడనుకున్న లక్ష్యసేన్.. ఆరంభ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించాడు. తొలి రౌండ్లో ప్రపంచ నంబర్‌వన్‌కు షాకిచ్చిన ఆయుష్ శెట్టి జోరు కొనసాగిస్తున్నాడు. మహిళల సింగిల్స్‌లో స్టార్ షట్లర్ పి.వి.సింధు కూడా ముందంజ వేసింది. బుధవారం పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో లక్ష్యసేన్ 21-19, 19-21, 17-21తో అమెరికా కుర్రాడు గారెట్ టాన్ చేతిలో పరాజయం పాలయ్యాడు. గంటా 13 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచి ఎంతో దూకుడుగా ఆడుతూ కోర్టులో ఎంతో వేగంగా కదిలిన టాన్‌ను అందుకోవడం లక్ష్యకు కష్టమైంది. మరో రెండో రౌండ్ మ్యాచ్‌లో ఆయుష్ శెట్టి 21-8, 21-10తో శ్రీలంక ఆటగాడు దుమిందు అబేయ్‌విక్రమను అలవోకగా ఓడించి ప్రిక్వార్టర్స్‌లో అడుగు పెట్టాడు.

పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో బై అందుకున్న స్టార్ ఆటగాళ్లు సాత్విక్ సాయిరాజు-చిరాగ్ శెట్టిలకు రెండో రౌండ్లోనూ కలిసొచ్చింది. ప్రత్యర్థి జోడీ అలెగ్జాండర్ డున్, ఆడమ్ ప్రింగిల్ (స్కాట్లాండ్) వాకోవర్ ఇవ్వడంతో భారత ద్వయం నేరుగా ప్రిక్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. హరిహరన్-ఎంఆర్ అర్జున్ రెండో రౌండ్లో 17-21, 14-21తో కాంగ్ మిన్-డాంగ్ జు (దక్షిణ కొరియా) ద్వయం చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

సింధు.. కొంచెం కష్టంగా: ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఆరో పతకంపై గురి పెట్టిన పి.వి.సింధు.. మహిళల సింగిల్స్‌లో ప్రిక్వార్టర్స్ చేరుకుంది. ఆమె రెండో రౌండ్లో 21-16, 21-17తో కెనడా అమ్మాయి వెన్ యు జాంగ్‌పై విజయం సాధించింది. 35 నిమిషాల్లోనే ముగిసిన మ్యాచ్‌లో తొలి గేమ్‌లో సగం వరకు ప్రత్యర్థి సింధుకు గట్టి పోటీ ఇచ్చింది. ఐతే 11-10తో ఆధిక్యంలో ఉన్న దశలో జోరు పెంచిన భారత షట్లర్.. వరుసగా ఆరు పాయింట్లు సాధించింది. అదే ఊపులో గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లోనూ జాంగ్ అంత తేలిగ్గా లొంగలేదు. తొమ్మిదో సీడ్ సింధు.. ప్రిక్వార్టర్స్‌లో చైనా క్రీడాకారిణి వాంగ్ జి యిని ఢీకొంటుంది. మరోవైపు యువ షట్లర్ ఉన్నతి హుడా పోరాటం ముగిసింది. ఆమె 21-11, 9-21, 21-23తో మిచెలీ లి (కెనడా) చేతిలో పోరాడి ఓడింది. చివరి గేమ్‌లో 21-20తో మ్యాచ్ పాయింట్‌పై నిలిచి కూడా ఉన్నతి ఓటమి పాలైంది.

# భారత్‌లోనే క్రేజ్ ఎక్కువ.. నాకు రెండో ఇల్లు లాంటిది: ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్



.భారతదేశంతో తనకు బలమైన అనుబంధం ఉందని, తనకు రెండో ఇల్లు లాంటిదని ఆస్ట్రేలియా మాజీ ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్ (Shane Watson) పేర్కొన్నాడు. సిడ్నీలోని భారత కాన్సులేట్ నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో షేన్ వాట్సన్ పాల్గొని ప్రసంగించాడు. దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగమవడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తునని తెలిపాడు. ఆస్ట్రేలియా కంటే భారత్‌లోనే తనకు ఎక్కువ ఆదరణ లభించిందన్నాడు. తనకు 19 ఏళ్లు ఉన్నప్పుడు తొలిసారి భారత్‌లో పర్యటనకు వచ్చానని, అప్పటితో పోలిస్తే ఇప్పుడు ఇండియా శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నాడు. శాకాహార వంటకాలు తనకు ఎంతో ఇష్టమని పేర్కొన్నాడు.

"ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనడం నాకెప్పుడూ ఒక ప్రత్యేకమైన అనుభూతినిస్తుంది. భారతీయ ప్రజలు నా జీవితం, వృత్తిపై అద్భుతమైన ప్రభావం చూపారు. వారితో నాకు బలమైన అనుబంధం ఉంది. భారత్ నాకు మరో ఇల్లు. ఇది చాలా ఆసక్తికరమైన విషయం. ఆస్ట్రేలియా తరఫున సుదీర్ఘకాలం పాటు క్రికెట్ ఆడే అదృష్టం నాకు లభించింది. కానీ భారతదేశంలో నాకు ఎప్పుడూ ఎంతో ఆదరణ లభించేది. 2008లో ఐపీఎల్ (IPL) ప్రారంభమైంది. నా కెరీర్‌లో కీలకమైన ఆ సమయంలో అద్భుతమైన ప్రదర్శనలు చేసే అవకాశం నాకు ఆ వేదిక ద్వారా దక్కింది. ఆస్ట్రేలియాతో పోలిస్తే భారత్‌లో క్రికెట్‌ను ప్రేమించే వారు చాలా ఎక్కువ మంది ఉన్నారు. కానీ, ఇండియాలో నన్నెప్పుడూ అంతగా విమర్శించలేదని నేను ఎప్పుడూ భావించేవాడిని. అక్కడ నాకు ఎక్కువ మద్దతు లభించేది. అదే ఆస్ట్రేలియాలోనైతే బాగా ఆడినప్పుడు ప్రశంసలు వచ్చేవి. ఒకవేళ బాగా ఆడకపోతే విమర్శలు ఎదురయ్యేవి" అని వాట్సన్ వివరించాడు.

వాట్సన్ 2008 నుంచి 2020 వరకు ఐపీఎల్‌లో ఆడాడు. రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. మొత్తం 145 మ్యాచ్‌లు ఆడి 3, 874 రన్స్ చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలున్నాయి. బౌలర్‌గా 92 వికెట్లు పడగొట్టాడు.

# శ్రీలంకతో రెండో టెస్టు.. సారాంశ్ జైన్ ఎంట్రీ ఖాయమే..!



శ్రీలంక, భారత్ మధ్య ఆగస్టు 23 నుంచి రెండో టెస్టు ప్రారంభంకానుంది. గాలెలో గెలిచి ఊపుమీదున్న టీమ్ఇండియా కొలంబో వేదికగా జరిగే రెండో టెస్టులోనూ విజయం సాధించి లంకేయులను వైట్‌వాష్ చేయాలని భావిస్తోంది. లంక టూర్ కోసం తొలిసారి టెస్టు జట్టు నుంచి పిలుపు అందుకున్న ఆల్‌రౌండర్ సారాంశ్ జైన్ కొలంబో టెస్టులో అరంగేట్రం చేయడం ఖాయంగా కనిపిస్తోంది. అతడు తుది జట్టులో చోటు దక్కించుకునేందుకు బలమైన అవకాశాలున్నాయని జట్టు వర్గాలు జాతీయ మీడియాకు తెలిపాయి. ఆఫ్ స్పిన్నర్ అయిన సారాంశ్‌ను ఆడిస్తే ఎడమ చేతివాటం స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌పై వేటు పడటం ఖాయం. గాలెలో అతడు 25 ఓవర్లు వేసి ఒకే వికెట్ పడగొట్టాడు. మరోవైపు, మానవ్ సుతార్, రవీంద్ర జడేజా సత్తాచాటారు. వారిద్దరిని తుది జట్టు నుంచి తప్పించే పరిస్థితి లేదు. ఈ లెక్కన చూసకుంటే కుల్‌దీప్ యాదవ్‌ను పక్కన పెట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి. పైగా శ్రీలంక జట్టులో చాలా మంది ఎడమచేతి వాటం బ్యాటర్లు ఉన్నారు. దీంతో ఆఫ్ స్పిన్నర్ అయిన సారాంశ్ వైపే టీమ్‌మేనేజ్‌మెంట్ మొగ్గుచూపే అవకాశాలున్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన ఈ 33 ఏళ్ల వెటరన్ స్పిన్నర్ రెడ్‌బాల్ క్రికెట్‌లో అదరగొట్టి 11 ఏళ్ల నిరీక్షణ తర్వాత భారత జట్టు నుంచి పిలుపు అందుకున్నాడు. ఇటీవల ఇండియా 'ఎ' (IND A) శ్రీలంక పర్యటనకు వెళ్లిన ఇతను రెండో అనధికార టెస్టులో ఆరు వికెట్లు పడగొట్టాడు. బ్యాటింగ్‌లో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 70 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945